1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | జనవరి 25, 2025 | www.navatelangana.com

కామారెడ్డి కలెక్టర్‌కు బెస్ట్ ఎలక్టోరోల్ ప్రాక్టీస్ అవార్డు



నవతెలంగాణ-కామారెడ్డి

15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌కు ఎన్నికలకు సంబంధించిన విధానాలకు బెస్ట్ ఎలక్టోరోల్ ప్రాక్టీసు అవార్డు-2024 వరించింది. హైదరాబాద్ రవీంద్ర భారతిలో నేడు(శనివారం) అవార్డు తీసుకోనున్నట్టు అధికారులు తెలిపారు. గతంలో నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన కాలానికి ఈ అవార్డు స్వీకరించనున్నారు. కాగా కలెక్టర్‌కు అవార్డు రావడంతో వివిధ శాఖల అధికారులు అభినందనలు తెలియజేశారు.

ప్రమాదవశాత్తు మంజీరా నదిలో పడి బాలుడు మృతి



నవతెలంగాణ-నిజాంసాగర్

ప్రమాదవశాత్తు మంజీరానదిలో జారిపడి బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో శుక్రవారం వెలుగుజూసింది. ఎస్ఐ శివకుమార్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోస్కి సందీప్ (13) గురువారం ఉదయం అదే గ్రామానికి చెందిన ఎర్రోళ్ల స్వామితో వడ్డేపల్లి గ్రామ శివారులోని తుమ్మల గడ్డ వద్ద గల పొలానికి తోడుగా వెళ్ళాడు. పొలానికి నీటిని పార పెట్టడానికి అక్కడీ మోటార్ స్టార్ట్ చేయడానికి వెళ్ళిన స్వామి తిరిగి వచ్చి చూసేసరికి అక్కడే ఉన్న సందీప్ పొలం పక్కన ఉన్న నాగమడుగు ఎత్తిపోతల పథకం పక్కన ఉన్న కాలువలో కాలు జారిపడ్డాడు. స్వామి ఇచ్చిన సమాచారం మేరకు గ్రామస్తులు వచ్చి కాలువలో వెతకగా సందీప్ శవం లభ్యం అయింది. ప్రాజెక్టు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వలనే సందీప్ మృతిచెందాడని కుటుంబీకులు వాపోయారు. బాలుడి తల్లి బాలమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

సభలపై సందేహాలు



- గందరగోళంగా సాగి ముగిసిన గ్రామ, వార్డు సభలు
- సంక్షేమ పథకాల జాబితాలో పేరు ఉందని సంతోషపడాలో లేదని బాధపడాలో తెలియని దుస్థితి
- సోషల్ మీడియాలో డిప్యూటీ సీఎం ప్రకటనతో జనం అయోమయం

నవతెలంగాణ-బోధన్

నాలుగు సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామ, వార్డు సభలు నిర్వహించింది. ఈ సభల్లో సంబంధించిన శాఖల అధికారులు పాల్గొంటు ప్రజల సందేహాలకు సమాధానం ఇస్తున్నారు. అలాగే పలు పథకాల కోసం గతంలో ఇంటింటి సర్వేలో భాగంగా ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే వాటిని పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. ప్రస్తుతం గ్రామ సభలు జరుగుతున్న క్రమంలో గ్రామసభలలో కొంతమంది పేర్లతో ఉన్న జాబితాను అధికారులు ప్రకటించారు. అంతవరకు బాగానే ఉంది. కానీ ఈ జాబితాలో ఉన్న పేర్లు చూసి సంబంధికులు తాము పథకాలకు ఎంపికయినట్లు భావించి ఆనందపడిపో తున్నారు. ఇది దేనికి సంబంధించిన జాబితానో తెలవక మరికొంతమంది జనం గందరగోళా నికి గురవుతున్నారు. కాగా తాజాగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెబుతున్న ఓ వీడియో సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతుంది.

జాబితాలో పేర్లు ఉన్నోళ్లు లబ్ధిదారులు కారటా

ప్రజాపాలన గ్రామ సభల్లో భాగంగా గ్రామ పంచాయితీలలో పేర్లతో ప్రకటించిన జాబితా లబ్ధిదారులది కాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెపుతున్న ఓ వీడియో సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతుంది. దాంతో ఆ వీడియోలోని సారాంశంతో జనంలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే గతంలోనే ఇంటింటి సర్వేలో ప్రజలు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. దాంతో జనం ఎగబడి రేషన్ కార్డుల కోసం, ఇందిరమ్మ ఇండ్ల కోసం, ఇతర పథకాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అయితే ప్రస్తుతం గ్రామ సభలు జరుగుతున్న సంధర్భంగ అధికారులు కొంతమంది పేర్లను మాత్రమే మాకు వచ్చాయని ప్రకటించారు. జాబితాలో పేర్లు ఉన్న వారు సంతోషపడుతున్నారు.

జాబితాలో పేర్లురాని వారు కలవరపడి అధికారులను నిలదీస్తున్నారు. ఈ విధంగా పలుచోట్ల అధికారులు సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడుతున్న సంఘటనలు ఎదురవుతున్నాయి. అయితే మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉంటే తాజాగా డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క జాబితాలో పేర్లు వచ్చినంత మాత్రానా వారు లబ్ధిదారులు కారని, దరఖాస్తులు చేసుకున్న వారి పేర్లు మాత్రమేనని ఆ వీడియోలో చెప్పారు. దరఖాస్తులు చేసుకోలేని వారు దరఖాస్తులు చేసుకుంటే అవన్నింటిని పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ప్రకటించారు. ఆయన వ్యాఖ్యలతో జనం అయోమయానికి గురవుతున్నారు. గతంలోనే సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకున్నామని అధికారులు ఇంటింటికి తిరిగి అర్హులైన వారి గురించి సర్వే చేశారని మళ్లీ ఇంకా దరఖాస్తులు చేసుకునేవారు చేసుకోవాలని చెప్పడం ఏమిటో తెలవక జనం అయోమయానికి గురవుతున్నారు. లబ్ధిదారుల ఎంపిక జరగనప్పుడు ఈ గ్రామ సభలు ఎందుకు పెట్టారో, దాని ఉద్దేశమేంటోనని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గందరగోళం మధ్యే ముగిసిన సభలు

సభలపై ప్రజలకు ముందు నుంచే అనేక అనుమానాలు ఉన్నాయి. సభల ప్రారంభంలో ముందుగా లిస్టును ప్రదర్శించక పోవడంతో చాలా మంది లబ్ధిదారులు తమ పేర్లు ఉన్నాయో లేవోనని మరోమారు దరఖాస్తు చేసుకున్న పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రేషన్ కార్డుల కోసం గతంలో ప్రజాపాలన సమయంలో దరఖాస్తు చేసుకోగా.. కానీ లిస్టులో కొందరి పేర్లు మాత్రమే రాగా.. మరికొందరి పేర్లను దరఖాస్తులు చూసుకుంటూ చెప్పారు. కానీ వీరి సర్వే పూర్తి కాలేదు. ఎంపిక చేసిన జాబితాలో తక్కువ మంది ఉంటుండగా.. దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా ఉంది. దీంతో ఎవరికి రేషన్ కార్డులు మంజూరు అవుతాయో పలు చోట్ల అధికారులకు సైతం అవగాహన లేకుండా పోయింది. ఎవరైనా తమ పేరు రాలేదంటే మరోసారి దరఖాస్తు చేసుకోమని చెబుతున్నారు. ఇప్పటికే పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా మని, ఇంకా ఎన్నిసార్లు చేసుకోవాలని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వెల్లువలా దరఖాస్తులు

- రేషన్‌కార్డులకు పెద్దమొత్తంలో వినతులు
- నిజామాబాద్‌లో 81,148, కామారెడ్డిలో 54,534 దరఖాస్తులు
- ముగిసిన గ్రామ, వార్డు సభలు



నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్

రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైత భరోసా, ఇందిరమ్మ రైతుకూలీ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం నాలుగు రోజుల పాటు నిర్వహించి గ్రామ, వార్డు సభలు శనివారంతో ముగిసాయి. ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించగా.. మున్సి పాల్టీల్లో వార్డు సభలు నిర్వహించింది. కాగా ఈ సభల్లో దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. అయితే రేషన్‌కార్డులకు పెద్దమొత్తంలో దరఖాస్తులు వచ్చాయి. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 81,148 దరఖాస్తులు రాగా.. కామారెడ్డిలో 54,534 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 530 గ్రామాలు, 146 మున్సిపల్ వార్డుల్లో నాలుగు రోజుల పాటు గ్రామసభలు నిర్వహించారు. గ్రామాలను క్లస్టర్ 113 క్లస్టర్‌లుగా, వార్డులను 20 క్లస్టర్‌లుగా విభజించి సభలు నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం టీమ్‌లను ఏర్పాటు చేసింది. 21వ తేదీ నుంచి 24 వరకు నాలుగు రోజుల పాటు సభలు నిర్వహించగా.. పెద్దమొత్తంలో దరఖాస్తు వచ్చాయి. కామారెడ్డి జిల్లా 535 గ్రామాల్లో, 80 మున్సిపల్ వార్డుల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. అయితే రేషన్‌కార్డులు కావాలని ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. వీటితో పాటు ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సైతం పెద్దమొత్తంలో దరఖాస్తులు వచ్చాయి. కాగా దరఖాస్తుల ఫైనల్ లిస్టును నేడు అందజేయనున్నట్టు అధికారులు తెలిపారు.

దరఖాస్తుల వివరాలు జిల్లాల వారీగా

పథకం	నిజామాబాద్	కామారెడ్డి
రేషన్‌కార్డులు	81,148	54,534
ఇందిరమ్మ ఇండ్లు	40,266	28,653
రైతు భరోసా	1,626	2,653
ఆత్మీయ భరోసా	19,305	18,098

అర్హులకే అదేవిధంగా చూడాలి

- గ్రామ సభలో అధికారులను నిలదీసిన గ్రామస్తులు

నవతెలంగాణ-దోమకొండ/రామారెడ్డి



దోమకొండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు , ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలను ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, అధికారుల ఆధ్వర్యంలో పథకాల జాబితాను శుక్రవారం గ్రామస్తులకు చదివి వినిపించారు. గ్రామసభలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి భూమి ఉన్న వారిని ఎంపిక చేశారాని, భూమి లేని వారికి వచ్చే విధంగా చూడాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారి పేరు రాలేదని, భవనం ఇల్లు ఉన్న వారి పేర్లు దరఖాస్తులో రావడంతో, మహిళలు గ్రామస్తులు అధికారులను గ్రామసభలో నిలదీశారు. రేషన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో కొంతమందికి రేషన్ కార్డు జాబితాలో పేర్లు రావడంతో , తమ తమ పేర్లు ఎందుకు రాలేదంటూ అధికారులను గ్రామస్తులు నిలదీశారు.

అనర్హులను జాబితాను సిద్ధం చేశారని, దరఖాస్తులపై మళ్ళీ విచారణ చేయలని గ్రామస్తులు అభ్యతరం తెలిపారు. గ్రామ సభలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, పథకాలకు అనర్హుల జాబితాను చదివి వినిపించారని గ్రామసభలో అధికారులను గ్రామస్తులు నిలదీశారు. మళ్లీ విచారణ చేసి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని కోరారు. గ్రామసభలో పేర్లు రానివారు,ప్రభుత్వ పథకాలకు కోసం మళ్లీ దరఖాస్తులు అందజేయాలని తహసీల్దార్ సంజయ్‌రావు అధికారులు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తిరుమల గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంతరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, నాయకులు నల్లపు శ్రీనివాస్, నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ రేఖ రెవిన్యూ, పంచాయతీ, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రసాభాసగా రామారెడ్డి గ్రామసభ



రామారెడ్డి : మండల కేంద్రంలో శుక్రవారం గ్రామసభ రసాభాసగా ముగిసింది. అధికారులు లబ్ధిదారుల లిస్టులను చదువుతుండగా గ్రామస్తులు ప్రభుత్వం ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, ఇష్టా రాజ్యాంగ లిస్ట్‌లను తయారు చేశారని, నిజమైన లబ్ధిదారులను లిస్టులో నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతిరెడ్డి, ఏపీవో ధర్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు,

అర్హత కలిగిన పేదలకు లబ్ధి చేకూర్చాలి

జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్

అర్హత కలిగిన పేదలకు లబ్ధి చేకూర్చాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 36వ వార్డులో ప్రజాపాలన వార్డు సభలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం అర్హులైన పేదల నుండి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. గత ప్రజాపాలనపై నాలుగు పథకాలకు సంబంధించిన వాటికి దరఖాస్తులు సమర్పించిన వారికి వార్డ్ సభలో ఆమోదం పొందడం, ప్రస్తుతం వార్డు సభల్లో సమర్పిస్తున్న దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. జాబితాలో పేరు రానివారు దరఖాస్తులు సమర్పించవచ్చని, దరఖాస్తులు స్వీకరించడం నిరంతర ప్రక్రియ అని, అట్టి దరఖాస్తులు మున్సిపల్ కార్యాలయంలో గాని తహసీల్దార్ కార్యాలయంలో గానీ సమర్పించవచ్చని తెలిపారు.

మున్సిపల్ చైర్పర్సన్ ఇందు ప్రియ మాట్లాడుతూ అర్హత కలిగిన వారందరికీ లబ్ధి కలిగే వరకు దరఖాస్తులు స్వీకరించడం నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రంగనాథ్ రావు, మున్సిపల్ కమీషనర్ స్పందన, వార్డు కౌన్సిలర్ లతా శ్రీనివాస్, మున్సిపల్ డిప్యూటీ ఈఈ వేణుగోపాల్ , మున్సిపల్ సిబ్బంది, వార్డులోని ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

అవకాశం కల్పిస్తే అందనంత ఎత్తుకు ఎదుగుతారు

- అంట్లుతోమే స్థాయి నుంచి అంతరిక్షం వరకు వెళ్లిన మహిళలు
- బాల్య వివాహాలు అరికట్టాలి
- భేటీ భచావో భేటీ పడావో కార్యక్రమంలో పలువురు వక్తలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మహిళలకు అవకాశం కల్పిస్తే అందనంత ఎత్తుకు ఎదుగుతారని పలువురు వక్తలు అన్నారు. ప్రస్తుతం ప్రోత్సాహం కల్పించడంతో అంట్లుతోమే స్థాయి నుంచి అంతరిక్షం వరకు వెళ్తున్నారని.. కుటుంబం, సమాజం మరింత ప్రోత్సాహం కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని, బాలికలు స్వేచ్ఛగా చదువుకునే స్థాయి కల్పించాలని చెప్పారు. మహిళ శిశు దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకొని, భేటీ భచావో భేటీ పడావో కార్యక్రమం ప్రారంభించి పది సంవత్సరాలు పూర్తి ఐన సందర్భంగా స్పోర్ట్స్ గ్రౌండ్ నుండి న్యూ అంబేద్కర్ భవన్ వరకు విద్యార్థిని లతో ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. అనం తరం ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించి తదుపరి న్యూ అంబేద్కర్ భవనంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, మేయర్ దండు నీతు కిరణ్

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా అర్బన్ ఎమ్మెల్యే సూర్య నారాయణ ధనపాల్ గుప్తా పాల్గొని ఆడపిల్లలు మహిళలు అంటే గతంలో చిన్న చూపు చూసే వారని ప్రస్తుతం ప్రభుత్వాలు ఆడపిల్లలు మహిళల సంక్షేమానికి అనేక పథకాలు ప్రారంభిం చడం వల్ల అంట్లు తోమే స్థాయి నుండి అంతరిక్షానికి వెళ్ళే స్థాయి వరకు ఎదిగారని, బాల్య వివాహాలు అరికట్టడంలో ఇంకా ఎక్కువ సమన్వయంతో పని చేయాలని అన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, మహిళలు, విద్యార్థులు

నగర మేయర్ దండు నీతూ కిరణ్ మాట్లాడుతూ.. ఆడపిల్లలు మహిళలు ఎదగడానికి కుటుంబ సభ్యుల సహకారం చాలా అవసరం అని అన్నారు. మహిళా కమిషన్ మెంబర్ సుదాం లక్ష్మీ మాట్లాడుతూ.. పిల్లలకు ఫోన్ లు దూరముగా పెట్టాలని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి యస్ కే రసూల్ బి మాట్లాడుతూ.. యునిసెఫ్ నివేదిక ప్రకారం 18 సంవత్సరాల లోపు ఉన్న ఆడపిల్లలకు 40 శాతం పెళ్ళిళ్ళు జరుగుతున్నాయని , 15 సంవత్సరాల లోపు ఉన్న ఆడపిల్లలకు 12 శాతం పెళ్ళిళ్ళు జరుగుతున్నాయని 25 సంవత్సరాల లోపు ఉన్న ఆడపిల్లలకు 30 శాతం మాత్రమే పెళ్ళిళ్ళు జరుగుతున్నాయని దీనిని పెంచాలని అన్నారు. డి యం అండ్ హెచ్‌వో రాజశ్రీ మాట్లాడుతూ.. ఆరోగ్య శాఖా వారి ఆధ్వర్యంలో లింగ నిర్ధారణ పరీక్షలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంటున్నామని చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో అల్ ఇండియా రేడియో డిడి మోహన్ దాస్ , జిఈసి ఓ భాగ్యలక్ష్మి, డిఎంసి మాధవి సిడిపివో లు, సూపర్ వైజర్, వెంకటేశ్వర్ హెల్త్ డిపార్ట్మెంట్,లు డి హెచ్ ఈ డబ్ల్యూ డీఎంసీ స్వప్న, సౌమ్య, పుష్ప, కవిత, ఆదిత్య, ఉదయ్ అదేవిధంగా డిసిపిఓ చైతన్య ఐ సి పి యస సిబ్బంది, సఖి, పోషణ్ అభియాన్ వారు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభములో జెడ్ పి హెచ్ సి, మల్లారం, మానవతా సదన్, విజయ్ పబ్లిక్ స్కూల్, మైనారిటీ వెల్ఫేర్ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థినిలు ఆడపిల్లల, మహిళల పై జరుగుతున్న లైంగికదాడు లపై, అన్యాయాలపై చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బాలికలు ధైర్యంగా ఉండాలి

- జిల్లా జడ్జి సునీత కుంచాల



'ఎడ్యుకేట్ ఏ గర్ల్.. ఎడ్యుకేట్ ఏ జనరేషన్' ప్లకార్డులతో ర్యాలీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

బాలికలు ధైర్యంగా ఉండాలని, ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని జిల్లా జడ్జి సునీత కుంచాల సూచించారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులతో కలిసి జిల్లా కోర్టు నుంచి ధర్నా చౌక్ వరకు ర్యాలీ నిర్వహించగా న్యాయమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. ధర్నా చౌక్‌లో విద్యార్థులు ఉపాధ్యాయులు న్యాయవాదులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యంతోపాటు ఇతర సమస్యలు ఏవి ఎదురైనా ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు చెప్పాలని, నెలసరి సమస్యలపై చర్చించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. డీసీపీ బస్వారెడ్డి మాట్లాడుతూ.. బాలికలు ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు. ఎలాంటి సమస్యలున్నా 1098 కు ఫోన్ చేయాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల కోసం అనేక పథకాలను ప్రవేశ పెట్టాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. న్యాయమూర్తి పద్మావతి మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నప్పటి నుండే పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఉన్నత స్థాయిలో ఉండడానికి ప్రయత్నం చేయాలన్నారు. బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మాడవేడి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లా జడ్జి కుంచాల సునీతను ఆదర్శంగా తీసుకోవాలని, అభివృద్ధి పథాన అడుగులు వేస్తూ సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం అర్సపల్లి, గుండారం, మల్లారం, సిర్నాపల్లి పాఠశాలల విద్యార్థినులకు దాతల సహకారంతో సానిటరీ నాప్కిన్ లు అందజేశారు. కార్యక్రమంలో బీసీటీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ కొట్టాల రామకృష్ణ, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, గౌరవ సలహాదారు రమణస్వామి తదితరులు పాల్గొన్నారు.

నకిలీనోట్ల చలామణి ముఠా అరెస్టు



అధికారులు స్వాధీనం చేసుకున్న నకిలీ కరెన్సీ నోట్ల కట్టలు

- ఆలయ క్యాషియర్‌తో పాటు మొత్తం 9 మంది నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు
- ఆలయ జాతర వేళ.. నకిలీ నోట్లు చలామణి

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని చద్మల్ తండా గ్రామపంచాయతీలో సంక్రాంతి సందర్భంగా జరిగే లక్ష్మమ్మ జాతర వేళ.. నకిలీ నోట్ల చలామణి చేసిన ముఠాను అరెస్టు చేసినట్టు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. కాగా ఆలయ క్యాషియర్ మాండ్ గోపాల్ సూత్రదారి అని.. ఆయన నకిలీ నోట్లు తీసుకొచ్చి అసలు నోట్ల మధ్య కలిపి అప్పుగా తీసుకున్న వారికి ఇచ్చారని తెలిపారు. కాగా మొత్తం 9 మంది నిందితుల ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. సదాశివనగర్‌లోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గాంధారి మండలం చద్మల్ తండా నందు ప్రతి సంవత్సరం సంక్రాంతి సందర్భంగా లక్ష్మమ్మ జాతర నిర్వహిస్తారు. జాతర అయిపోయిన తర్వాత గుడి నందు మిగిలిన డబ్బులను అవసరం ఉన్నవారికి వడ్డీ రూపంలో నగదు ఇస్తుంటారు. కాగా లక్ష్మమ్మ గుడి నందు క్యాషియర్ గా పని చేసే మాండ్ గోపాల్.. అదే గ్రామానికి చెందిన మాలి రవీందర్‌తో కలిసి గుడి డబ్బులు వేరే వాళ్ళకి మిత్తికి ఇచ్చే సందర్భంలో 500 నోట్ల కట్టల్లో కొన్ని నకిలీ నోట్లను కలిపి అందజేశారు. డబ్బులు తీసుకున్నవారు నకిలీ నోట్లను



నిందితులను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

గుర్తించి సదాశివనగర్ సిఐ సంతోష్ కుమార్, గాంధారి ఎస్సై ఆంజనేయులుకు ఫిర్యాదు చేయగా.. విచారణ చేపట్టారు. మాండు గోపాల్, మాలి రవీందర్‌ను విచారించగా వాళ్ల దొంగ నోట్లు తీసుకువచ్చారని తేలింది.

డప్పు తండాకు చెందిన బడవత్ సంగ్రామ్ అనే వ్యక్తి వాళ్ళకి ఇచ్చి ఈ నకిలీ డబ్బులను చలామణి చేయగా వచ్చిన డబ్బులను తనకి సగం ఇవ్వాలని తెలిపినడాని, బడవత్ సంగ్రామ్‌ను సైతం అదుపులోకి తీసుకొని విచారించారు. గత కొన్ని నెలల క్రితం, నిజామాబాద్‌కు చెందిన తిరుపతి అలియాస్ రాజు అనే ఒక వ్యక్తి పరిచయం అయ్యాడని అతనితో ఫోన్లో మాట్లాడగా తన వద్ద నకిలీ నోట్లు ఉన్నాయని నమ్మించాడు. అవి చాలా మందికి చలామణి చేస్తే డబ్బులు బాగా సంపాదించవచ్చు. బాగా లాభాలు కూడా వస్తాయని అతను చెప్పడంతో ఇట్టి విషయాన్ని పోచారం తండాకు చెందిన మూడు రవీందర్‌కు, అలాగే కొనా పూర్ సోమ్లా నాయక తండాకు చెందిన ధరవత్ చందర్ కూడా తెలుపగా వాళ్లు కూడా సరే అని ఒప్పుకు న్నారు. సంగ్రామ్, రవి, చందర్ ముగ్గురు కలిసి నిజామాబాద్‌కు వెళ్లి తిరుపతి అలియాస్ రాజు, మగ్గిడి కిషన్ అలియాస్ వెంకట్, రామ్ భాను ప్రసాద్‌ను కలిసారు. ఒక అసలు నోట్ ఇస్తే దానికి బదులు నాలుగు నకిలీ నోట్లు ఇస్తానని బేరం కుదుర్చుకొని.. సంగ్రామ్ రవి చందర్ తెచ్చిన లక్ష ఇరవై వేల రూపాయలు వాళ్లకి ఇచ్చారు. అయితే ఒక బ్యాగ్ ఇచ్చి అందులో ఐదు లక్షల రూపాయల నకిలీ కరెన్సీ ఉందని చెప్పగా.. ంటికి వచ్చి చూసుకునే సరికి అవి దాదాపు రెండు లక్షల నకిలి నోట్లు మాత్రమే ఉన్నాయి.

దీంతో తాము మోసపోయినట్టు గ్రహించిన వారు.. వాటిని ఎలా అయినా చలామణి చేయాలనే ఉద్దేశ్యంతో సంగ్రామ్ అనే వ్యక్తి మాలి రవితో ఉన్న స్నేహబంధం ద్వారా మాలి రవితో ఒప్పందం చేసుకొని, సంగ్రామ్ దగ్గర నుంచి మాలి రవి దాదాపు లక్ష రూపాయలు తీసుకొని, దాని నుండి ఒక 20 వేల రూపాయల నోట్లను క్యాషర్‌గా ఉన్న మాండు గోపాల్ కు ఇవ్వగా, ప్రజలకు మిత్తికి ఇచ్చే సందర్భంలో ఒక 500 రూపాయల కట్టలో ఒకటి లేదా రెండు నోట్లు నకిలీ 500/- రూపాయల నోట్లను కలుపుతూ పంపిణీ చేశారు. అయితే ఇట్టి నోట్లను నిర్మల్ జిల్లాకు చెందిన తిరుపతి అలియాస్ రాజు అనే వ్యక్తి అలాగే విజయవాడకు చెందిన జగన్ అలియాస్ రాము అనే వ్యక్తుల ద్వారా అందినట్లు విచారణలో తేలింది. నేరంలో భాగస్తులైన 1. మాండు గోపాల్, 2. మాలి రవీందర్ 3. బడావత్ సంగ్రామ్ 4. మూడు రవీందర్ 5. ధరావత చందర్ 6. మగిడి కిషన్ 7. రామ్ టింకి భాను ప్రసాద్ లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. విచారణలో భాగంగా నిందితుల వద్ద నుంచి 9 మొబైల్ ఫోన్లను, ఒక బైకును, రూ.1,45,500/- విలువగల 500 రూపాయల 291 నకిలీ నోట్లను, 31400/- రూపాయల విలువ గల 200 రూపాయల 157 నకిలీ నోట్లు స్వాధీన పరచుకోనైనది. మిగతా నోట్లను నిందితులు కాల్చివేశారు.

నేర విచారణలో చాకచక్యం ప్రదర్శించి నిందితులను పట్టుకున్న సదాశివనగర్ సిఐ సంతోష్ కుమార్, గాంధారి ఎస్సై ఆంజనేయులు, టెక్నికల్ టీమ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, ఐడి పార్టీ కానిస్టేబుల్ రవికుమార్, సాయిబాబా, గాంధారి హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డిని, సిబ్బంది బంతిలాల్, సుబాష్ మిగతా సిబ్బంది అందర్నీ జిల్లా ఎస్పీ సింధు శర్మ అభినందించినారని ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాసులు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
శనివారం | జనవరి 25, 2025 | www.navatelangana.com

తెలంగాణ పోలీస్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఆవరణంలో తెలంగాణ పోలీస్ సిటిజెన్ ఫీడ్ బ్యాక్ పోస్టర్‌ను శుక్రవారం నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయి రెడ్డి, రైల్వే సిబ్బంది ఆవిష్కరించారు. దీనిలో భాగంగా ప్రజలు ప్రతి విషయంపై స్కానర్ ద్వారా పోలీసుల పనితనం తప్పిదాలను కూడా స్కానర్ ద్వారా ఫీడ్ బ్యాక్ తెలియజేయవచ్చని తెలిపారు. కనుక ప్రజలందరూ దీన్ని సద్వినియోగం చేయనుకోవాలని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై సాయిరెడ్డి తెలిపారు.


పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న రైల్వే పోలీస్‌లు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తడపాకల్ గ్రామానికి చెందిన ఎనుగందుల ఉమ కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ. ..ఆపరేషన్ చేయించు కుంది. వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా బాల్కొండ నియోజక`వర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి సహకార ంతో ఆమెకు 60 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరు అయింది. ఆ చెక్కును గ్రామ కాంగ్రెస్ నాయకులు బాధితురాలికి శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా బాధితురాలి కుటుంబ సభ్యులు సునీల్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.


చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజల వజ్రాయుధం ఓటు

- నేడు జాతీయ ఓటరు దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

పౌరులంతా కలిసి తమకు సేవ చేసే పాలకులను ప్రత్యక్షంగా ఎన్నుకునేందుకు రాజ్యాంగం అందించిన వజ్రాయుధం ఓటు హక్కు. దీన్ని సద్వినియోగం చేసుకోవడానికి ఎన్నికల సంఘం విస్తృత ప్రచారం కల్పిస్తుంది. గల్లీ నుంచి ఢిల్లీ దాకా పాలకులను శాసించే అధికారాన్ని మనకు కట్టబెట్టిన ఓటు హక్కుపై ప్రజలను చైతన్య పరచడానికి ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నవ తెలంగాణ ప్రత్యేక కథనం.....

ప్రాథమిక హక్కు...

18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరునికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు ఓటు హక్కు. నేటి రాజకీయ వ్యవస్థలో మార్పులు యువతతోనే సాధ్యం అనే భావన ప్రతి ఒక్కరిలో ఉంది. స్వతంత్రం వచ్చినప్పటి నుంచి దేశంలో పార్లమెంట్ ఎన్నికలు 15 సార్లు, శాసనసభ ఎన్నికలు 17 సార్లు, తెలంగాణ ఏర్పడిన తర్వాత మూడుసార్లు. కానీ ఇప్పటివరకు పూర్తి స్థాయిలో ఓటర్ నమోదు పోలింగ్ శాతం నమోదు కాలేదు.

1950 జనవరి 25న ఏర్పాటు...

రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం పౌరులకు సార్వత్రిక ఓటు హక్కు కల్పించారు .18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు లోక్ సభ, రాష్ట్ర శాసనసభ, స్థానిక సంస్థల ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకోవచ్చని భారత ఎన్నికల సంఘం 1950 జనవరి 25న ఓటు హక్కును కల్పించింది.

2011నుండి ఓటరు దినోత్సవం

2011 జనవరి 25 నాటికి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అప్పటినుంచి జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి..

18 ఏళ్లు నిండిన యువత జన్మదిన ధ్రువీకరణ పత్రం లేదా పదోతరగతి మెమో, రెండు ఫొటోలతో ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చు. ఓటు హక్కు నమోదు నిర్దేశించిన ఫారం ఆరును జత చేసి అందులో దరఖాస్తుదారు వివరాలు పంపాలి. ఓటరు జాబితాలో పేర్లు తొలగించేందుకు లేదా అప్లికేషన్‌కు ఫారం సమర్పించాలి. ఓటరు జాబితాలో నమోదైన వివరాలను సరిదిద్దేందుకు ఫారం-8 ఓటర్ జాబితాలో ఉన్న ఓటును మరో పోలింగ్ కేంద్రానికి బదిలీ చేయడానికి 8-ఏ సమర్పించాలి.



ఓటు వేసేది ఎలా..

పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు ఏర్పాటు చేస్తారో అందులో పొందుపరిచిన జాబితాలోని అభ్యర్థి ఎదురుగా ఉన్న నీలం రంగు బటన్ నొక్కడం ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఒకరికి ఒకసారి మాత్రమే ఓటు వేసే అవకాశం ఉంటుంది. ఓటు వేయగా నీలం రంగు ఎరుపు రంగులోకి మారుతుంది. ఒకవేళ మీ ఓటును వేరేవారు ఎవరైనా వినియోగించుకున్నట్లయితే గుర్తిస్తే చాలేజింగ్ ఓటు కోసం ఎన్నికల సిబ్బందిని సంప్రదించవచ్చు. ఒక పోలింగ్ కేంద్రంలో చాలెంజింగ్ ఓటర్ల సంఖ్యను బట్టి జరిగినట్లు భావిస్తే ఈసీ అక్కడ మరోమారు ఎన్నికలు జరిపే వీలుంటుంది.

మార్పు రావాలి...

ఇదివరకు మన దగ్గర ఓటర్ నమోదు ప్రక్రియ అంతా గందరగోళంగా ఉండేది. ఓటర్ నమోదు ప్రకటించే కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన ఉండేది కాదు. కానీ ఈ దశాబ్ద కాలంలో వివిధ సంస్థలతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎన్నికల సంఘం నమోదు ప్రక్రియను సరళీకృతం చేశారు. అయినప్పటికీ ఓటు హక్కు వినియోగించడంలో మాత్రం వెనుకబడి ఉంటున్నారు. ప్రజలు గ్రామాల్లో 70శాతం పట్టణాలలో 60 శాతం లోపే ఓట్లు పోలవడం దేశ జనాభాలో 65 శాతంగా ఉన్న యువత 50శాతం లోపే ఓటు హక్కు వినియోగించుకున్నట్లు గణాంకలు చెబుతున్నాయి.

ఓటు హక్కే కాదు.. బాధ్యత కూడా..

75 వసంతాలు దాటిన ప్రజాస్వామ్యంలో పౌరులంతా ఇంకా ఓటు హక్కు గురించి సరిగ్గా తెలియడం లేదని పలుచోట్ల అక్కడక్కడ జరుగుతున్న ఘటనలు చూస్తుంటే రుజువు అవుతుంది. కొంతమంది చదువుకున్న వ్యక్తులు కూడా చిన్నచిన్న సాకులతో పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓపికతో ఓటు వేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఓటు వేయకపోతే ఏమవుతుంది. ఓటు హక్కు వినియోగించుకోకుంటే నాకేమీ నష్టం లేదు కదా అనుకుంటున్నారు. ప్రజాస్వామ్యానికి ఓటే ప్రధాన వజ్రాయుధం లాంటిదని ఓటు హక్కు కలిగిన ప్రతి పౌరుడు తెలుసుకోవాలి.

19 32 సంవత్సరంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బ్రిటిష్ వారితో పోరాడి ఓటు హక్కు అనే ఆయుధాన్ని కుల, మత , వర్గ ,లింగ భేదాలు లేకుండా 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరునికి ఓటు హక్కును కానుకగా అందించి మనల్ని పరిపాలించే నాయకుడిని మనమే ఎన్నుకునే అవకాశం కల్పించారు.

ఓటరు చైతన్యవంతులైతేనే...

ఓటర్లు చైతన్యవంతులుగా ఉన్నప్పుడే ప్రజాప్రతినిధిగా ఉన్న నాయకునికి గుబులు పుట్టి సుపరిపాలన అందిస్తారు. ఐదు సంవత్సరాల కాలంపాటు మనల్ని పరిపాలించడానికి నీతి నిజాయితీగల నిజమైన నాయకున్ని ఎన్నుకొని ఆయుధమే ఓటు అని గుర్తించాలి. సమాజంలో ఒక నాయకుడి ద్వారా మంచి జరిగిన చెడు జరిగిన అందుకు మనం కూడా భాగస్వాములమే. ఎందుకంటే మీ ఓటు ద్వారానే ఆ నాయకుడు పరిపాలకుడిగా మారతాడు. ఆ ప్రభుత్వం నీ ఓటు ద్వారానే అధికారంలోకి వస్తుంది. ప్రతి పౌరుడు ఓటు వేయడం హ క్కు మాత్రమే కాదు బాధ్యత కూడా అని ఓటు వలువ గురించి తెలుసుకోవాలి.

నిజామాబాద్ జిల్లాలో..

ఓటరు జాబితా సవరణ అనంతరం జిల్లాల్లో ఈనెల ఆరవ తేదీన తుది జాబితాను వెల్లడించారు. ఈ ప్రకారం జిల్లా ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 14,35,214 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. వయసుల వారీగా ఓటర్ల వివరాలు ప్రకటించగా జిల్లాలో 18 నుండి 19 ఏళ్లవారు 26,006 మంది 20, 29 వారు 3,06,125 మంది మొత్తంగా 3,32,131 మంది యువ ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు. రానున్న ఎన్నికల్లో వీరి పాత్ర కీలకం కానుంది. ఏటా ఎన్నికల సంఘం ఓటరు నమోదుకు అవకాశం కల్పిస్తుంది. 18 ఏళ్లు నిండిన వారు తమ పేరు నమోదు చేసుకునేందుకు రెండు నెలల పాటు అవకాశం ఇచ్చింది. అయినా చాలామంది నమోదుకు ముందుకు రాలేదు. ముఖ్యంగా ఇతర ప్రాంతాల్లో చదువుతున్న వారు నిర్లక్ష్యం చేస్తుంటారు. తమకు ఎందుకన్నట్లు శ్రద్ధ చూపడం లేదు. ఓటు నమోదు నిరంతర ప్రక్రియ. ఆన్లైన్లో లేదంటే నేరుగా తహసిల్దార్ కార్యాలయాల్లో పేరు నమోదు చేసుకోవచ్చు.

ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గల వారీగా..

ఆర్మూర్ నియోజకవర్లో 18 నుండి 19 సంవత్సరాల వారు 4,256,. 20, 29 సంవత్సరాల 45,327, 30 ,39 సంవత్సరాల 5,980, 40, 49 సంవత్సరాల. 43,761, 50 ,59 సంవత్సరాల వాళ్లు 34,467, 60, ,69 సంవత్సరాల వాళ్లు 20,689, 70, 79 సంవత్సరాల వాళ్ళు 11,079, 80 పైన 3,577 ఉన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో 18,19 సంవత్సరాల వాళ్లు 4,773, 20, 29 సంవత్సరాలు వాళ్లు 49,358, 30, 39 సంవత్సరాల వాళ్లు55,640, 40,49 సంవత్సరాల వాళ్ళు... 45,832, 50, 59 సంవత్సరాల వాళ్ళు 37,400, 60,69 సంవత్సరాల వాళ్ళు 22,577, 70, 79 సంవత్సరాల వాళ్ళు 11,122, 80 పైన 3,282 ఉన్నారు.

అతి విలువైన ఆయుధం

భవాని శంకర్, అటవీ డివిజనల్ అధికారి, ఆర్మూర్



రాజ్యాంగంలో మనకు కల్పించిన అతి విలువైన ఆయుధం ఓటు. ప్రజాస్వామ్య పరిరక్షణలో నేటి యువత ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలి. ఓటు వేసే ముందు ... దేశ భవిష్యత్తుకు మన ఓటు అన్నది మర్చిపోవద్దు.

ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలి

బంటు మహిపాల్, సొసైటీ చైర్మన్, గోవింద్‌పేట్



ఐదు సంవత్సరాల భవిష్యత్తును నిర్ణయించే ఓటును కానుకలకు, తాయిలాలకి అమ్ముకొని భవిష్యత్తును అంధకారంలోకి నెట్టి వేయకుండా ప్రతిపరుడు ప్రజాస్వామ్య బాటను గెలిపించడానికి ఓటు వేయాలి.

అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌లో రాష్ట్రస్థాయికి వివేకానంద విద్యార్థులు


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వివేకానంద హైస్కూల్ విద్యార్థులు అబాకస్ వేదిక మాథ్స్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం ఆనందంగా ఉందని పాఠశాల యాజమాన్యం కరస్పాండెంట్ లత నారా గౌడ్ అన్నారు. విశ్వం ఎడ్యుటెక్ జోనల్ లెవెల్ కార్యక్రమం గురువారం నగరంలోని అంబేద్కర్ భవన్లో నిర్వహించారు. కార్యక్రమంలో నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు, అందులో ముఖ్యంగా అబాకస్, వేదిక్ మాథ్స్ కాంపిటీషన్లో నిజామాబాద్ నగరానికి చెందిన వివేకానంద హై స్కూల్ విద్యార్థుల అబాకస్ విజువలైజేషన్ పోటీలో 3వ తరగతి విద్యార్థి జోహా ఫిర్దోస్, వేదిక్ మాథ్స్ పోటీలలో 9వ తరగతి విద్యార్థి మెహవీష్ నాజ్‌లు స్టేట్ లెవెల్ కు సెలెక్ట్ అయ్యారు. ఎంపికైన విద్యార్థులను మాజీ జెడ్పీ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు అభినందించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం కరస్పాండెంట్ లతా నారా గౌడ్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు అభినందన తెలియజేస్తూ ముందు ముందు జరిగే పోటీల్లో రాష్ట్రస్థాయిలో గెలుపొందాలని సూచించారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఎంపిక కావడంపై అనందం వ్యక్తం చేశారు.

ఒక సీసీ కెమెరా.. వంద మంది పోలీసులతో సమానం


- ఎస్ఐ అనిల్ రెడ్డి


దాతను సన్మానిస్తున్న ఎస్ఐ, వీడీసీ సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని కమ్మర్ పల్లి ఎస్ఐ అనిల్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చౌట్‌పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సీసీ కెమెరాలను గ్రామానికి చెందిన దాత నిజామాబాద్, కరీంనగర్ జిల్లా కేంద్రాల్లో రియన్స్ కాలేజ్ ఆఫ్ హెూటల్ మేనేజ్మెంట్ నిర్వాహకులు గడ్డం మహేందర్ అందించిన రూ.95 వేలతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో, వ్యాపార సముదాయాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు ఎంతో ముఖ్యమన్నారు. ఏదైనా సంఘటన జరిగితే నిందితులను గుర్తించేందుకు సిసి కెమెరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. సీసీ కెమెరాల సహాయంతో ఎంతోమంది నిందితులను పట్టుకున్న ఘటనలు ఉన్నాయన్నారు. అనంతరం దాత మహేందర్‌ను ఎస్ఐ అనిల్ రెడ్డి, గ్రామం అభివృద్ధి కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ స్పందన, మండల విద్యాధికారి ఆంధ్రయ్య గ్రామ పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షులు కొమ్ముల రాజేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, క్యాషియర్ రమేష్, నవీన్ గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఇందూరు తిరుమల క్షేత్రాన్ని సందర్శించిన సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ ఇంజనీర్ ఆంజనేయ రెడ్డి



నవతెలంగాణ-మోపాల్

ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రాన్ని శుక్రవారం సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ ఇంజినీయర్ ఆంజనేయ రెడ్డి సందర్శించారు. వివిధ రైల్వే స్టేషన్ల ఇన్‌స్పెక్షన్లలో భాగంగా నిజామాబాద్ జిల్లాకి వచ్చారు. అందులో భాగంగా సౌత్ సెంట్రల్ చీఫ్ ఇంజినీయర్ ఆంజనేయ రెడ్డి మోపాల్ మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో గల ఇందూరు తిరుమల ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు రోహిత్ కుమారాచార్య స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించి ఆశీర్వదించారు. అనంతరం ఆంజనేయ రెడ్డి ఆలయ కేంద్రంగా చేస్తున్న ఆధ్యాత్మిక ప్రకృతి సేద్యాన్ని చూశారు. కట్టె గానుగ యూనిట్ కూడ సందర్శించారు. ఆలయం కేంద్రంగా సమాజ నిర్మాణం కోసం పని చేస్తున్న ఆలయ ధర్మకర్త నర్సింహారెడ్డిని అభినందించారు. ఆయనతో పాటు ఏఈ శ్రీహరి , ఆలయ సేవకులు నరాల సుధాకర్, ప్రవీణ్, పృథ్వీ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

- బిజెపి మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల కోసం చేసిన సేవలను దృష్టిలో పెట్టుకొని ఆయన ఆశయాలను కొనసాగించాలని ఇందల్ వాయి బిజెపి మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను అవమానపరిచిందని, అనాటి పార్లమెంట్ సభలో నుండి నెట్టి వేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. బిజెపి ప్రభుత్వం అంబేద్కర్ ఆశయాలకోసం నిరంతరం కృషి చేస్తుందని సూచించారు. అనంతరం బూత్ అధ్యక్షులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు నాయుడి రాజన్న, మండల ఉపాధ్యక్షులు అశోక్, లోకాని గోపి, సాయికుమార్, మహేష్, జితేందర్, ప్రవీణ్, అరుణ్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకృష్ణను, పిఈటీ నేతను విధుల నుంచి తొలగించాలి

- పీడీఎస్‌యు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

క్రీడాకారుల డబ్బులను కాజేస్తున్న , అవినీతికి పాల్పడుతున్న స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకిషన్, పిఈటీ నేత ను విధులనుండి తొలగించాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత డిసెంబర్ నెలలో పురుషులకు ఖో ఖో పోటీలు తమిళనాడులో జరిగాయని, యూనివర్సిటీ నుండి 12 మంది క్రీడాకారులు వెళ్లారని తెలిపారు. వీరి కోసం యూనివర్సిటీ అధికారులు 76,800 రూపాయలు స్పోర్ట్స్ అధికారులు అందించారన్నారు. క్రీడాకారులకు ట్రావెలింగ్ మరియు భోజనానికి 45 వేల రూపాయలు ఇచ్చారని, వారు మిగిలిన 5000 రూపాయలు తిరిగి ఇచ్చారని తెలిపారు. వెళ్లిన క్రీడాకారులకు ముందుగానే లేదా వచ్చిన తర్వాత అని గేమ్ కిట్, ట్రాక్ షూట్ ఇతరములు ఇవ్వాలని, వీరికోసం నెల క్రితం చెల్లించిన డబ్బులను ఖర్చుచేయకుండా క్లైమ్ చేసిన మిగిలిన 36800 ఏం చేసినట్టని ప్రశ్నించారు. యూనివర్సిటీలో క్రీడకారుల సెలక్షన్ జరిగినప్పుడు ప్రతి టీం నుంచి 1000 రూపాయలు తీసుకుంటున్నారని, నిర్వాహణ కోసం 2000 రూపాయలు కూడా ఖర్చు కావడం లేదని అన్నారు. ఇప్పటివరకు టీంలు చెల్లించిన డబ్బులు ఏం చేశారని... ?, స్పోర్ట్స్ గురించి తెలియని బాలకిషన్ ప్లేయర్లను ఎలా సెలక్షన్ చేస్తారని, స్పోర్ట్స్ లో అవినీతి చాప క్రింద నీరులా జరుగుతుందని, అవినీతికి పాల్పడుతున్న స్పోర్ట్స్ డైరెక్టర్, నేతపై చర్యలు తీసుకోవాలని, క్రీడాకారుల డబ్బులను వారికే ఖర్చు చేయాలని, అడ్మినిస్ట్రేటివ్ పొజిషన్స్ మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ నాయకులు ప్రిన్స్, దేవిక, బిందు, హుస్సేన్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-మోపాల్

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించబడిన ముప్ప గంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ హెూదాలో తొలిసారి మండల పరిషత్ కార్యాలయానికి రావడంతో మండల అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల అధికారులు ఆయన దృష్టికి మండల పరిషత్‌కి సొంత భవనం కావాలని వివరించారు. ఎమ్మెల్యే భూపతి రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలో మన మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ప్రభుత్వ భవనాలు ఏర్పాటు చేసే విధంగా చూస్తామని ఆయన వారికి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాములు నాయక్ ఎంపీఓ కిరణ్ కుమార్ ,సూపర్డెంట్ ప్రదీప్, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జిల్లా శిక్ష పడిందని ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ రఘుపతి శుక్రవారం తెలిపారు. నిజామాబాద్ కేంద్రంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 23న గాంధీ చౌక్‌లో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ 1 టౌన్ నిజామాబాద్ బి. రఘుపతి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. గౌతమ్ నగర్‌క చెందిన సల్మాన్ అను వ్యక్తి మద్యం సేవించి బండి నడుపుతూ పట్టుబడ్డాడు. ఆయన్ను న్యాయస్థానం ముందు హాజరుపరచ`గా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధించగా, జైలు కు తరలించినట్టు తెలిపారు.

నిలదీతలు, నిరసనలు

- వాడీవేడీగా బోర్గం (పి) వార్డు సభ
- సౌకర్యాలు కరువు


మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-మోపాల్

బోర్గం (పి)ప్రజా పాలన వార్డు సభ శుక్రవారం నిరసనలు, నిలదీతల మధ్య కొనసాగింది. సంక్షేమ పథకాల ముసాయిదా జాబితాలో తమ పేర్లు లేవంటూ దరఖాస్తుదారులు గగ్గోలు పెట్టారు. బోర్గాం (పి)పరిధిలో గల 5వ డివిజన్ సభలో గందరగోళ వాతావరణం ఏర్పడింది. మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ కొత్త రేషన్ కార్డులు మంజూరైన వారి పేర్లు చదువుతుండగా మధ్యలో చాలామంది తమ పేర్లు లేవని సభను అడ్డుకన్నారు. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లిస్టులను చదివి వినిపించారు. ఆ లిస్టులో దారిద్రరేఖకు దిగువన ఉన్న వారి పేరు లేకపోవడం గమనార్హం. ఆర్థికంగా స్థిరంగా ఉన్న వారి పేర్లు ఇందిరమ్మ ఇళ్ల జాబితా, రేషన్ కార్డ్ జాబితాలో వచ్చాయి. కొందరు మహిళలు డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్‌కు తమ గోడును వినిపించారు. మరికొందరు మహిళలు తమ మెడలో ఉన్న నల్లపూసల పుస్తెల తాడును చూపించి మమ్మల్ని కరికరించాలని, మాకు తినడానికి తిండి లేదు ఉండటానికి ఇల్లు లేదని, పేదలమైన మాకు మీరు చదివిన లిస్టులో పేరు లేదని వాపోయారు. ఎన్నో సంవత్సరాల నుండి ఇంటికోసం, రేషన్ కార్డు కోసం ఎదురుచూస్తుంటే చివరికి కూడా నిరాశనే ఎదురైందని వారు వాపోయారు. సభ మధ్యలో లబ్ధిదారుల లిస్టు చదివే సమయంలో అక్కడున్న ప్రజలు గగ్గోలు పెట్టిన అక్కడున్న వార్డు ఆఫీసర్ బావన ఎంతో ఓపికతో మహిళలకు నచ్చచెప్పుతూ మీరు అప్లికేషన్స్ ఇవ్వండి మేము దగ్గరుండి సర్వే చేసి మీకు న్యాయం జరిగే విధంగా చూస్తానని సభను కొనసాగే విధంగా తోడ్పడ్డారు. అక్కడికి వచ్చిన ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో మున్సిపల్ యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. కనీసం నిలబడటానికి కూడా స్థలం లేకపోవడంతో వృద్ధులు, బాలింతలు చాలా అవస్థలకు గురయ్యారు. చిన్నపిల్లలను తీసుకువచ్చిన తల్లుల పరిస్థితి మరి అధ్వానంగా తయారైంది. అక్కడ స్థలం లేకపోవడంతో పిల్లలు ఏడుస్తున్న వారికి పాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా మున్సిపల్ యంత్రాంగం కొత్తగా విలీనమైన ప్రాంతాలపైన ప్రత్యేక శ్రద్ధ వహించి అక్కడ కనీస సదుపాయాల ఏర్పాటు చేయాలని ప్రజలు వేడుకున్నారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, ఏఈ ఇనాయత్, మున్సిపల్ అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు మంత్రులు రావాలి

- సవాల్ విసిరిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ సభలు గ్రామాల్లో గొడవలు పెట్టడానికి మాత్రమే అని స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఒక్క గ్రామంలో కూడా లబ్ధిదారులు ఎంపిక సక్రమంగా జరగలేదని, ఏ ఒక్క గ్రామంలో కూడా సక్రమంగా జరిగినట్లు నిరూపించడానికి బహిరంగ చర్చకు కాంగ్రెస్ మంత్రులు రావాలని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఎక్స్ అకౌంట్లో ప్రభుత్వానికి సవాల్ విసిరారు.

పెండింగ్ స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్షిప్‌లను వెంటనే విడుదల చేయాలంటూ డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 30న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే బిసి విద్యార్థుల సమర శంఖారావం కరపత్రాలు బీసి సంక్షేమ సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ కేర్ డిగ్రీ కాలేజీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరాల సుధాకర్ మాట్లాడుతూ.. తక్షణమే నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సుమారుగా 4.500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు ఏ విధంగా స్కాలర్ షిప్ వస్తుందో అదేవిధంగా బీసీ విద్యార్థిలకు కూడా ర్యాంకుతో సంబంధం లేకుండా పూర్తి ఫీజులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు, బీసీ గురుకులాలకు, సంక్షేమ వసతి గృహాలలో సొంత భవనాలు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు బీసీలకు ప్రవేట్ యూనివర్సిటీలలో రిజర్వేషన్ అమలు చేయాలని అన్నారు పూలే ఓవర్సీస్ స్కాలర్షిప్ మంజూరు సంఖ్యను పెంచాలన్నారు హైదరాబాదులో 10 ఎకరాలలో పూలే నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. బీసీ విద్యార్థి నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి బీసీ విద్యార్థుల సమర శంకరాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి శేఖర్, బుస్స ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, ధర్మనం దేవేందర్, శ్రీలత, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బడి బయటి విద్యార్థిని పాఠశాలలో చేర్పింత

నవతెలంగాణ-ఏర్గట్ల

సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో బడిబయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించే కార్యక్రమాన్ని విద్యాశాఖ వారు చేపట్టారు. అందులో భాగంగా మండలంలోని దోంచంద గ్రామంలో గత రెండు నెలల నుండి పాఠశాలకు వెళ్ళని ఒకటో తరగతి విద్యార్థి హర్షవర్ధన్‌ను ఓఎస్సి సర్వేలో భాగంగా గుర్తించి సీఆర్పీ మహేంధర్ తిరిగి పాఠశాలలో చేర్పించారు.

ట్రెక్కింగ్ క్యాంపు విజయవంతం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల, నిజామాబాద్ ఎన్‌సిసి క్యాడెట్స్ పూజ, ఐశ్వర్య, నందిని. గుంటూరు జిల్లా కొండవీడులో జనవరి 16 నుండి 23 వరకు నిర్వహిం చిన ట్రెక్కింగ్ క్యాంప్- 2025ను విజయవంతంగా పూర్తి చేసుకొని శుక్రవారం కళాశాలకు చేరుకున్నారు. వారిని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామ్ మోహన్ రెడ్డి, ఎన్.సి.సి అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ ఎం. రామస్వామి ప్రశంసించారు. అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపక సిబ్బంది, కెడేట్లు శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కామారెడ్డి
శనివారం | జనవరి 25, 2025 | www.navatelangana.com

ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

నవతెలంగాణ-రాజంపేట్(భిక్కనూర్)

ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని రాజంపేట్ మండల వైద్య సిబ్బంది గ్రామస్తులకు సూచించారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా జంగంపల్లి, తలమడ్ల గ్రామాలలో వైద్యులు ఐశ్వర్య ఇంటి పరిసరాలను పరిశీలించి సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామస్తులు పరిసరాలు శుభ్రం చేసుకోవాలని, తొట్టిలు, నీటి కుండీలు, పాత టైర్లలో నీరు లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం యాదమ్మ, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.


సూచనలు చేస్తున్న వైద్యసిబ్బంది

పాఠశాలను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

నవతెలంగాణ-పొతంగల్

మండలంలోని కల్లూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సబ్ కలెక్టర్ వికాస్ మహతో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల్లో పఠన నైపుణ్యాలు, గణిత కార్యకలాపాలను గమనించారు. విద్యార్థుల ప్రతిభ, ఉపాధ్యాయుల పనితీరును చూసి సంతృప్తి చెందారు. ఎంఈఓ ఎల్.శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో విద్య, ఆరోగ్యం, వివిధ అంశాలపై చర్చించారు.


రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

రైతు భరోసాలో బ్యాంక్ ఖాతా మార్పిడికి అవకాశం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

రైతు భరోసాలో రైతులు ఎవరైనా వారి బ్యాంకు ఖాతా నెంబర్ మార్చుకోవాలనుకుంటే ఈనెల 29 వరకు అవకాశం కల్పించినట్లు ప్రశాంత్ తెలిపారు. ఖాతా మార్చుకోవాలనుకుంటే వారి పాస్ పుస్తకం, జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, నూతన బ్యాంకు ఖాతా జిరాక్స్‌తో పాటు దరఖాస్తు ఫారం నింపి ఆయా గ్రామాలలో అందుబాటులో ఉన్న రైతు వేదిక కార్యాలయంలో సమర్పించాలని ఆయన పేర్కొన్నారు.

నేడు 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం

నవతెలంగాణ-కామారెడ్డి

15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం 25-1-2025న కలెక్టరేట్ సమావేశ మందిరంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం జాతీయ ఓటర్ల దినోత్సవం థీమ్ 'ఓటును మించి ఏమీ లేదు - నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను' కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని ఆ ప్రకటనలో తెలిపారు.

మానవహారంలో ఉద్యోగులు విద్యార్థులు పాల్గొనాలి : ఆర్డీవో రంగనాథ్ రావు

15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం 25-1-2025 స్థానిక నిజాంసాగర్ చౌరస్తా వద్ద ఉదయం 9 గంటలకు మానవహారం ఏర్పాటు చేయనున్నారని రెవిన్యూ డివిజనల్ అధికారి, ఈఆర్ఓ రంగనాథ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు, పాఠశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ ప్రకటనలో తెలిపారు.

'బడి బయట పిల్లలు లేకుండా చూస్తాం'


బడిబయటి పిల్లల గుర్తింపు

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలో బడి బయట పిల్లలు లేకుండా చూస్తామని మండల విద్యాశాఖ అధికారి రామస్వామి అన్నారు. శుక్రవారం సంతాయిపేట్ గ్రామంలో నలుగురు బడిబయటి పిల్లలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. మండలంలో ఆయా గ్రామాల్లో బడి బయట పిల్లల పరిశీలిస్తున్నామని ఈనెల 31లోగా బడి బయట పిల్లలు లేకుండా చూస్తామని పలువురు తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లోనైనా, గురుకులాల్లో చేర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు నర్సింలు, రాజేందర్, తదితరులున్నారు.

ఏఎంసి వైస్ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్‌కు మోగా గ్రామ కార్యదర్శి నందు శుక్రవారం ఆ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. శాలువాతో సన్మానించినందుకు జిపి సెక్రెటరీకి ఏఎంసి వైస్‌చైర్మన్ పరమేష్ పటేల్ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ తాజా మాజీ ఎంపీటీసీ కుమారుడు నారాయణ, ఆ గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

జాగృతి అధ్యక్షురాలిని కలిసిన మాజీ వైస్ ఎంపీపీ

నవతెలంగాణ-తాడ్వాయి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను మండల మాజీ ఉపాధ్యక్షులు ముదాం నరసింహులు శుక్రవారం కలిసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఆమె స్వగృహానికి మర్యాద పూర్వకంగా వెళ్లి స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ సిద్ధాంతాలు, పలు విషయాలపై చర్చించినట్లు తెలిపారు.


కవితతో మాజీ వైస్ ఎంపీపీ

సోయా పంట కొనుగోలు చేపట్టాలి

- రైతుల వినతి


గ్రామసభలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-మద్నూర్

సోయా పంటను కొనుగోలు చేయాలని కోరుతూ రైతులు కోరారు. మద్నూర్, డోంగ్లి మండలాల్లో జరిగిన గ్రామసభల్లో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు. డోంగ్లి మండలంలోని మొగ గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆ గ్రామ రైతులు సోయా పంట కొనుగోలు జరిపించాలని సబ్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మద్నూర్ మండలంలోని రూసేగావ్ గ్రామంలో జరిగిన గ్రామసభలో పాల్గొన్నారు. గ్రామస్తులు పలు సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఇరు గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ ఫలాలు అర్హులైన వారికి అందించడానికి గ్రామ సభలు చేపడుతున్నట్టు వివరించారు. ఈ గ్రామసభల్లో మండల అభివృద్ధి అధికారి రాణి, మద్నూర్ తహసీల్దార్ ఎండి ముజీబ్, డోంగ్లి తహసీల్దార్ రేణుక చౌహాన్, మండల పంచాయతీ అధికారి వెంకట నరసయ్య, మండల ఏవో రాజు, మద్నూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ పరమేశ్ పటేల్, ఆయా గ్రామాల కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఆడపిల్లకు చదువు ముఖ్యం

- సీనియర్ సివిల్ జడ్జి టి.నాగరాణి
- జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా న్యాయ చైతన్య సదస్సు

నవతెలంగాణ-కామారెడ్డి

ఆడపిల్లకు చదువు ముఖ్యమని సీనియర్ సివిల్ జడ్జి టి.నాగరాణి తెలిపారు. శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కామారెడ్డి ఆధ్వర్యంలో కామారెడ్డి పట్టణంలోని ముదాంగల్లీలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ చైతన్య సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.నాగరాణి హాజరై మాట్లాడారు. బాలికల హక్కులు, చట్టాలపై వారికి వివరించారు. అలాగే ఇంట్లో ఆడపిల్ల పుట్టిందంటే మహాలక్ష్మి పుట్టినట్టేనని తెలిపారు. ఆడపిల్లకు చదువు అనేది చాల ముఖ్యమని అన్నారు. ఆడ పిల్లలు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి, ఉపాధ్యాయులు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది సాయిప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

ప్రతి డ్రైవర్ ఆరోగ్యంగా ఉండాలి

- మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ జె.శ్రీనివాస్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రతి డ్రైవర్ శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ జె.శ్రీనివాస్ తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా కామారెడ్డి ఆర్టీసీ డిపోలో రహదారి భద్రత అవగాహనా సదస్సును నిర్వహించారు. ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని ఎటువంటి ఒత్తిడి, అలజడికి లోనవ్వకుండా బస్సు నడపాలని సూచించారు. అత్యుత్తమ డ్రైవర్స్‌ను, మెకానిక్స్‌ను సత్కరించారు. ఈ అవగాహనా సదస్సులో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించి తిరిగి డిపోకు చేరుకొని ఉచిత కంటి పరీక్షలు, రక్తదాన శిబిరాలలో పదుల సంఖ్యలో కార్మికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి డిపో మేనేజర్ ఇందిర, ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహేష్, మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ ఆర్.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ డ్రైవర్, మెకానిక్‌లకు సన్మానం

ఉరేసుకుని ఇద్దరు ఆత్మహత్య

- లింగంపేట్‌లో వేర్వేరు ఘటనలు

నవతెలంగాణ-లింగంపేట్

అనారోగ్యానికి గురై జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం లింగంపేట్ గ్రామంలో చోటుచేసుకుంది. లింగంపేట్ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని నెహ్రూనగర్ కాలనీకి చెందిన చామంతుల కాశీరం 50 గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు పలు ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు చేయించినా తగ్గుముఖం పట్టలేదు. దాంతో కాశీరాం జీవితంపై విరక్తి చెంది తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. శవాన్ని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు కుమారుడు సందీప్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు కొడుకులు, కూతురు, భార్య ఉన్నారు.

తాగుడుకు బానిసై యువకుడు..

తాగుడుకు బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన లింగంపేట్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త బస్టాండ్ ప్రాంతంలో గల నాగరాజు (31) నిజాంసాగర్ మండలం అచ్చంపేటలో సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో స్వీపర్‌గా పని చేస్తున్నాడు. అయితే సంక్రాంతి పండగ సందర్భంగా నాగరాజు భార్య తన కూతురుతో కలిసి పుట్టింటికి వెళ్లింది. నాగరాజు కొంతకాలంగా తాగుడికి బానిసయ్యాడు. గురువారం సాయంత్రం ఏడు గంటలకు తన డ్యూటీ ముగించుకొని లింగంపేట్‌కు వచ్చాడు. ఇంటి దగ్గర ఉన్న తన తల్లి అయిన బాలమ్మతో తాగుడుకు డబ్బులు ఇవ్వమని గొడవపడ్డాడు. బాలమ్మని కొట్టి ఇంట్లో నుంచి వెళ్లగొట్టగా.. బాలమ్మ రాత్రి తన పక్క ఇంట్లో పడుకుంది. ఉదయం తల్లి లేచి తన కొడుకు అయినా నాగరాజుని పిలవగా పలకకపోవడంతో పాటు, తలుపులు తీయకపోవడంతో చుట్టుపక్కల వారు తలుపులు తెరిచి చూడగా.. మృతుడు సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెంది ఉన్నాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జోరుగా మొరం దందా

- ఫిర్యాదుతో వాహనాలు మాయం

నవతెలంగాణ-భిక్కనూర్



భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని గ్రామ శివారులో అక్రమంగా మొరం తవ్వకాలు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గత కొన్ని రోజులుగా అక్రమంగా మొరం తవ్వకాలు నిర్వహిస్తున్నారని, రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. అక్రమ మొరం తవ్వకాల నిర్వాహకులు పగటిపూట ఫిర్యాదు చేస్తే రాత్రి సమయంలో తవ్వకాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మొరం దందా అంతా రెవెన్యూ అధికారులకు తెలిసి జరుగుతుందా..?, తెలియకుండా జరుగుతుందా..? తెలియాల్సి ఉంది. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పట్టణ పురవీధుల గుండా యథేచ్ఛగా మొరం టిప్పర్ల ద్వారా తరలించడంతో గ్రామస్తులు, కాలనీవాసులు ఆగ్రహించి తహసీల్దార్ శివప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన రెవెన్యూ సిబ్బందిని తవ్వకాల వద్దకు పంపించారు. అప్పటికే సమాచారం అందుకున్న తవ్వకాల నిర్వాహకులు అక్కడి నుంచి పరారయ్యారు. మొరం తవ్వకాల నిర్వాహకులకు స్థానికులు సమాచారం ఇచ్చారా..?, రెవెన్యూ అధికారులే సమాచారం ఇచ్చి తవ్వకాల నుంచి వెళ్ళిపోవాలని సూచించారోననే అనుమానాలు గ్రామస్తుల్లో వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ అడ్డు అదుపు లేకుండా ఇష్టానుసారంగా మొరం తవ్వకాలు నిర్వహిస్తున్న వారిపై రెవెన్యూ అధికారులు శాఖపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన బోరును ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని 39వ వార్డులో ప్రియా టాకీస్ రోడ్డులో నీటి సమస్య ఉందని కౌన్సిలర్ మోటూరి శ్రీకాంత్ తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి బోర్ వేయించినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియా చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీవాసుల దాహం తీర్చడానికి బోరు వేసి, మోటార్ బిగించి బోరును ప్రారంభించినట్టు తెలిపారు. చెట్లు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యావరణాన్ని రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరం మొక్కలు నాటి పెంచాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నందున ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రతను పాటించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, వార్డు కౌన్సిలర్ మొటూరి శ్రీకాంత్, చాట్ల వంశీకృష్ణ, గోనె శ్రీనివాస్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ఓటే పునాది

- విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు


నవతెలం

నవతెలంగాణ-మద్నూర్

ప్రజాస్వామ్యానికి ఓటే పునాది అని.. ఓటుహక్కు ప్రజాస్వామ్యానికి ఆయువు పట్టని.. ఓటే వజ్రాయుధమని ప్రిన్సిపాల్ నందాల గంగాకిషోర్, ప్రముఖ పద్యకవి, సంస్కృతోపన్యాసకులు బి.వెంకట్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం, భారత ప్రభుత్వం ద్వారా నిర్వహించబడుతున్న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని మద్నూర్ తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం, జూనియర్ కళాశాలలో పాఠశాల, కళాశాల విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వినియోగం, ఓటే పునాది అనే అంశములపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ప్రధానవక్తగా వెంకట్ మాట్లాడుతూ.. ఓటు అనే రెండక్షరాల పదం దేశం చరిత్రను మార్చేస్తుందని అన్నారు. 2011 జనవరి 25వ తేదీన భారత ప్రభుత్వం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ప్రకటించి, కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులకు, ఓటు హక్కు ఉన్న యువతకు ఓటు ప్రాధాన్యతను తెలియజేయాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు ఉంటుందని అన్నారు. కుల, మత, ప్రాంత, లింగ, జాతి, భాష అనే భేదం లేకు ండా దేశంలో నివసించే 18 సంవత్సరాలు నిండిన పౌరులందరికీ ఓటు హక్కు ఉంటుందని అన్నారు. ఓటు విలువను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తెలిపారు.

ఓటు బహుమతులకు ఎంపిక..

తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం, జూనియర్ కళాశాలకు చెందిన కళాశాల విభాగంలో వ్యాసరచన పోటీల్లో యం.సాయికుమార్, కె.భరత్, కే.సాయికిరణ్, ఉపన్యాస పోటీలో యం.సాయికుమార్, సిహెచ్ ధమరుక్ నాయక్, ఆర్.ఆకాశ్, పాఠశాల విభాగంలో వ్యాసరచనలో జి.శివరామకృష్ణ, యు.ఈశ్వర్, జి.స్వామి, ఉపన్యాసంలో డి.రాంచరణ్, యు.ఈశ్వర్, బి.గణేశ్ మండలస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రభుత్వం పక్షాన యంఆర్ఓ కార్యాలయ ఆవరణలో జరిగే సభా కార్యక్రమంలో బహుమతులను అందజేస్తారని చెప్పారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా బి.వెంకట్, సంతోష్, రాము, గోవింద్, శైలజ వ్యవహరించారు. ఉపాధ్యాయులు గణేశ్, వేణుగోపాల్, సమీనా, ఎ.సంజీవ్, నాగేందర్, శేఖర్, గంగాప్రసాద్, దత్తాత్రేయ, జె.సంజీవ్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

నవతెలంగాణ-బోధన్



అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ బోధన్ డివిజన్ కార్యదర్శి పీ.వరదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీల అమలు పథకాలు ఆచరణలో విఫలం అవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న గ్రామ సభల్లో ప్రజలు తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లాంటి పథకాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిని బట్టి 360 డిగ్రీల కోణంలో పరిశీలించి జాబితా తయారు చేశామని చెబుతున్న అధికారులు ప్రజలకు ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. స్థానిక అధికారుల ప్రమేయం లేకుండా జిల్లా స్థాయిలో పరిశీలించి లబ్ధిదారుల ఎంపిక చేయడం సరైంది కాదని తెలిపారు. గ్రామసభల్లో ప్రజలు, అధికారులను నిలదీస్తుంటే మళ్ళీ దరఖాస్తులు పెట్టుకోవాలని చెప్పి అధికారులు తప్పించుకుంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజల నుంచి తిరుగుబాటు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

దాతల సహకారంతో క్రీడా దుస్తులు పంపిణీ

- విద్యాశాఖ అధికారి రామస్వామి


పంపిణీ చేసిన క్రీడా దుస్తులతో విద్యార్థులు

నవతెలంగాణ-తాడ్వాయి

దాతల సహకారంతో విద్యార్థిని విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేసినట్లు మండల విద్యాశాఖ అధికారి రామస్వామి తెలిపారు. కాళోజీవాడి పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామానికి చెందిన కొందరు దాతలు 50 వేల రూపాయలు సమకూర్చారని క్రీడా దుస్తులు, స్పోర్ట్స్ షూస్, గుర్తింపు కార్డులను విద్యార్థిని విద్యార్థులకు అందజేశామన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు మునుముందు కూడా గ్రామస్తుల సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి, ప్రభాకర్, రజిత, రాజు, రవి వెంకటరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మందకృష్ణ మాదిగ రాక

- మహాసభను విజయవంతం చేయాలి
- ఎమ్మార్పీఎస్ నాయకుల పిలుపు


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-రెంజల్

ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఫిబ్రవరి 7న నిర్వహిస్తున్న లక్ష డప్పులు.. 1000 గొంతుకలు మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు లక్ష్మీగారి భూమయ్య, సహాయ కార్యదర్శి బండారు పోశెట్టి మాట్లాడారు. 25న మండలంలోని ప్రతి గ్రామం నుంచి అత్యధిక సంఖ్యలో తరలిరావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జ్ కిన్నెర మోహన్, కోబి కన్వీనర్ బత్తుల సాయిలు, ఎమ్మార్పీఎస్ నాయకులు లక్ష్మణ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు వరం

- సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్


చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

నవతెలంగాణ-మద్నూర్

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం నిరుపేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు వరమని మద్నూర్ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు ధరాస్ సాయిలు, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు అనుమంతు యాదవ్ తెలిపారు. మండలానికి 130 మందికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన చెక్కులను శుక్రవారం తహసిల్దార్ కార్యాలయ ఆవరణంలో గ్రామాల వారీగా నాయకులు ప్రజాప్రతినిధులు చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ పథకాలు నిరుపేద ఆడబిడ్డల పెండ్లిళ్లకు వరంలా ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, తాజా మాజీ సర్పంచ్ విట్టల్ గురూజీ, కొడిచర సంజు, పెద్దఎక్లారా మహేష్, మద్నూర్ అమూల్ షిండే, సాయిలు, రాములు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా బార్ ఎగ్జామ్‌లో అడ్వకేట్ గోపాల్‌రెడ్డి ఉత్తీర్ణత

పలురాష్ట్రాల బార్ కౌనిల్స్‌నుండి అభినందనలు



నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆల్ ఇండియా బార్ ఎగ్జామ్‌లో అడ్వకేట్ గోపాల్‌రెడ్డి ఉత్తీర్ణులయ్యారు. భారతదేశంలో లా అధ్యయనం చేయడానికి లైసెన్స్ పొందారని న్యాయవాదులు తెలిపారు. ఆల్ ఇండియా బార్ నుండి న్యాయశాస్త్రంలో డిగ్రీ మాత్రమే చేస్తే సరిపోదు. పరీక్షలో ఎల్ఎల్బి సంవత్సరం 2024 అడ్వకేట్ తీసుకోవడం కోసం ఈ కోర్సును పూర్తి చేశారు. కొంరెడ్డి కోటవర్యాలం గోపాలరెడ్డి ఇండియా బార్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. తర్వాత బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మన్నన్ కుమార్ మిశ్రా సనద్ సర్టిఫికెట్ అందజేశారు. ఈయన విజయంపట్ల పంజాబ్, మహారాష్ట్ర, గోవా బార్ కౌన్సిల్స్‌నుండి అభినందనలు వెల్లుతున్నాయి. కాగా నిజామాబాద్ బార్ అసోసియేషన్ అభినందలు తెలియజేసింది.

నేడు బీఆర్ఎస్ పార్టీ రైతు అధ్యయన కమిటీ జిల్లాకు రాక

మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్/కమ్మర్‌పల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో జరుగుతున్న రైతు ఆత్మహత్యలు, రైతులు వ్యవసాయ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేయడానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియమించిన బీఆర్ఎస్ పార్టీ రైతు అధ్యయన కమిటీ చైర్మన్, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, కమిటీ సభ్యులు నేడు అదిలాబాద్ నుండి బయలుదేరి నిజామాబాద్ జిల్లాకు చేరుకొంటారని, రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారని మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు మెండోరా మండలం బుస్సాపూర్ గ్రామంలో రైతులతో ముఖాముఖి ఉంటుందని, తదనంతరం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం ఆర్గుల్ గ్రామంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ జిల్లా రైతులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్
- చివరి రోజు గ్రామ సభలో జోరుగా దరఖాస్తుల స్వీకరణ



నిజామాబాద్‌సిటీ : లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/డిచ్‌పల్లి

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. 28వ డివిజన్ గాజుల్‌పేట్ ప్రజాపాలన వార్డుసభకు ముఖ్యఅతిథిగా ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి సంవత్సరానికి 3500 ఇండ్లు ఇస్తామని మొదటి విడత కింద జాగా ఉన్న లబ్ధిదారులకు 5 లక్షల ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని స్వాగతిస్తున్నాం అన్నారు. ప్రభుత్వం నుండి వచ్చిన జాబితాలో అవకతవకలు జరిగినట్లు తన దృష్టికి వచ్చిందని, వాటిని వార్డు సభలో అధికారులు, కమిటీ సభ్యులు సరి చేయాలని, అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే పార్టీలకు అతీతంగా అందించాలని అన్నారు.

మరో 3500 ఇండ్లు కేటాయించి జాగా లేని వాళ్లకు ప్రభుత్వ స్థలంలో ఇండ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డు లేక చాలా మంది గరీబోళ్ళు సంక్షేమ పథకాలకు దూరం అయ్యారని అన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చే ప్రతి సంక్షేమ పథకానికి రేషన్ కార్డు ప్రామాణికం కాబట్టి అర్హులైన వారందరికీ ప్రభుత్వం రేషన్ కార్డులు జారీ చేయాలనీ సూచించారు. లబ్ధిదారుల ఎంపిక జాబితాకే పరిమితం చేసే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేయాలనుకుంటే ప్రజల తరుపున పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, స్థానిక కార్పొరేటర్ ఇల్లేందుల మమత ప్రభాకర్, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ఉన్నారని అధికారులు, నాయకులు అన్నారు. ఈనెల 21నుండి 24వరకు గ్రామ సభలు నిర్వహించారని, 26న నాలుగు పథకాలను అమలు చేస్తుందని, మిగిలిన హామీలను అమలు చేసి తీరతుందని, మాట ఇస్తే అమలు చేయడం కాంగ్రెస్ పార్టీ విధానమని పార్టీ ఇందల్ వాయి మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు అనంత రావు, శ్రీనివాస్ గౌడ్, తహసీల్దార్లు ప్రభాకర్, వెంకట్ రావు, ఎంపిఓ రాజ్ కాంత్ రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మోహన్, తదితరులు ప్రజలకు సూచించారు . ప్రజా పాలనలో భాగంగా గ్రామ సభ చివరి రోజు మండలం లోని బీబీ పూర్, ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి, వెంగల్ పహాడ్, గంగారం తండా ఎల్లారెడ్డిపల్లితోపాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. ఇప్పటి వరకు అయా పథకాలు రాని వారు దరఖాస్తులు చేసుకుని లాబ్ధి పొందాలన్నారు. దరఖాస్తు ఇవ్వనివారు సైతం నిరంతరం ఎప్పుడైనా మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వవచ్చని సూచించారు. సంక్షేమ పథకాలు అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, రాని వారు ఎలాంటి అపోహలు పడవద్దని సూచించారు. అర్హులకే సంక్షేమ పథకాలను అందజేసే విధంగా అధికారులు చూడాలని, అనర్హులను ఏరి కోరి తొలగించాలని పలువురు అధికారుల దృష్టికి తీసుకుని వచ్చారు. సమావేశాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శులు శ్రీధర్, గౌతమి, సింగోటం, శ్రావణ్ కుమార్, కవిత, వేముల దివ్య, జయశ్రీ, అశ్వంత్, అశోక్, భారత్, నరేష్, రజని, వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్ కుమార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మోహన్, శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్లు గంగా ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ విమలా బాయి, కాంగ్రెస్ నాయకులు డిసిసి డెలిగేట్ సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి : మాట్లాడుతున్న నాయకులు

రైతు భరోసా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలి

- మండల వ్యవసాయాధికారి వైష్ణవ్

నవతెలంగాణ-ఏర్గట్ల/ముప్కాల్

రైతు భరోసా పథకానికి ఈ సంవత్సరం జనవరి 1 నుంచి 2025 వరకు కొత్తగా వచ్చిన పట్టాదార్ పుస్తకం గల రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి వైష్ణవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి గాను రైతు పట్టాదార్ పాసుబుక్ లేదా డిజిటల్ సంతకం అయిన జిరాక్స్, ఆధార్ కార్డ్ జిరాక్స్, బ్యాంక్ సేవింగ్ ఖాతా జిరాక్స్, పూర్తిగా నింపిన దరఖాస్తు ఫారం మీ క్లస్టర్ ఏఈఓకు లేదా వ్యవసాయాధికారికి సమర్పిస్తే సరిపోతుందని అన్నారు.

ముప్కాల్: రైతు భరోసాకు ఎంపికైన నూతన పట్టాదారులు తమ తమ పూర్తి వివరాలను అందజేయాలని మండల వ్యవసాయాధికారి సాయికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు ఖాతా మార్పిడి ఉన్నవారు, ఫోన్ నంబర్ లింక్ లేనివారు తమ వివరాలను సరి చేసుకోని సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామాల వారిగా రైతు భరోసాకు ఎంపికైన వారి వివరాలను వెల్లడించారు. ముప్కాల్ 26, రెంజర్ల 39, వేంపల్లి 25, కొత్తపల్లి 30, నల్లూర్ 18, నాగంపేట్ 18, వెంచిర్యాల 09 ఇలా మొత్తంగా 165 మంది ఎంపికైనట్లు తెలిపారు. దరఖాస్తు ఫారంను పూర్తి చేసి రైతు వేదికలో ఏఈవో లకు అందజేయాలని పేర్కొన్నారు.

అర్బన్ అభివృద్ధి.. నా బాధ్యత

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామబాద్ సిటీ

16వ డివిజన్ దుబ్బ, 17వ డివిజన్ రాజీవ్ నగర్, 39వ డివిజన్ గౌతమ్ నగర్, 41వ డివిజన్ చంద్రశేఖర్ కాలనీలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ నీతు కిరణ్‌తో కలిసి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 14వ ఫైనాన్స్ ద్వారా ప్రతి డివిజన్‌కు పదిలక్షల రూపాయలు మంజూరు అయ్యాయని అన్నారు. అందులో భాగంగా సీసీ రోడ్, నిర్మాణ పనులకు భూమి పూజ చేశారన్నారు. పనులు నాణ్యతతో త్వరతగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు 16వ డివిజన్ పంచ రెడ్డి ప్రవళిక, 17 డివిజన్ మాయావర్ సవిత, 39 వ డివిజన్ నీచ్చంగ్ లత, కృష్ణ, 41వ డివిజన్ బురుగుల ఇందిర, వినోద్, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలకేంద్రంలోని ఘనపూర్ గ్రామంలో నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ షాదుల్లా, నాయకులు రామకృష్ణ సవిత, సొసైటీ డైరెక్టర్ సతీష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ లింబాద్రి, హరీష్ పటేల్, గంగి భూపతి, శంకర్ గౌడ్, సాగర్ పాల్గొన్నారు.

28న కబడ్డీ జట్టు ఎంపిక

నవతెలంగాణ-ముప్కాల్

71వ సీనియర్ పురుషుల ఇంటర్ డిస్టిక్ కబడ్డీ ఛాంపియన్షిప్‌లో పాల్గొనే జిల్లా సీనియర్ పురుషుల కబడ్డీ జట్టును ఈ నెల 28న ముప్కాల్ మండల కేంద్రంలోని 'భూదేవ్ ఇండోర్ స్టేడియం'లో ఎంపికలు నిర్వహించనున్నట్టు జిల్లా కబడ్డీ అధ్యక్షులు అంద్యాల లింగయ్య జనరల్ సెక్రెటరీ కె.గంగాధర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే కబడ్డీ క్రీడాకారులు ఈ నెల 28న ఉదయం 10 గంటల లోపు ఆధార్ కార్డ్ తో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. బరువు 85 కిలోల లోపు ఉండాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరి 04 నుండి 07 వరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే పోటీలలో పాల్గొంటారాని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

ఇండోర్ స్టేడియానికి లక్ష విరాళం

నవతెలంగాణ-ముప్కాల్

నిశిత గ్రూప్ ఇండస్ట్రీ చైర్మన్, బీజేవైయం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయకుడు సంతోష్ తనవంతు సాయంగా ముప్కాల్ ఇండోర్ స్టేడియానికి రూ.లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఇండోర్ స్టేడియం అభివృద్ధికి లక్ష రూపాయలను అందజేసినట్లు ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు కె.గంగాధర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్, చిల్క దినేష్, గిరి స్వామి, ప్రవీణ్, సంజీవ్ థామస్, వినోద్, లోక సుభాష్ అకాడమీ సభ్యులు పాల్గొన్నారు.

ఆటల్లో ముందుంచుతున్నాం

- భార్గవి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ ప్రగతి పట్వారి

నవతెలంగాణ-ఆర్మూర్



తమ పాఠశాలలో చదివే విద్యార్థులకు చదువుతోపాటు ఆటపాటల్లో ముందు ఉంచుతున్నామని మండలంలోని అంకాపూర్ గ్రామ భార్గవి విద్యానికేతన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ప్రగతి పట్వారి అన్నారు. శుక్రవారం పాఠశాలలో రిపబ్లిక్ డే సందర్భంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చదువులో సైతం ముందుండి తల్లిదండ్రులకు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పేరు తీసుకురావాలని కోరారు. క్రమశిక్షణకు మారుపేరుగా భార్గవి విద్యానికేతన్ పాఠశాలలో చదివిన వారు ఉన్నత స్థాయికి ఎదగడం అభినందనీయమని కరస్పాండెంట్ వెంకటేష్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించడానికి కృషి చేస్తాం



మాట్లాడుతున్న అయ్యప్ప శ్రీనివాస్

నవతెలంగాణ-ఆర్మూర్

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించడానికి కృషి చేస్తామని కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 29వ వార్డులో శుక్రవారం ప్రజాపాలన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల గురించి లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ చైర్మన్ సాయిబాబాగౌడ్, కౌన్సిలర్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత గల సహకార సంఘాల సభ్యులకు

కర్షకమిత్ర రుణసదుపాయం

- అధ్యక్షులు కుంట రమేష్ రెడ్డి



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంకు 103వ అర్ధవార్షిక మహాజన సభ అధ్యక్షులు కుంట రమేష్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బ్యాంకు సాధించిన ప్రగతి వివరించారు. బ్యాంకు ఆర్థిక కార్యకలాపాలు 2000 కోట్ల మైలురాయి చేరుకుందని అన్నారు. దీనికి సహకరించిన సహకార సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. పంటరుణాలను ఇదివరకు ఉన్న లక్ష యాభై వేల రూపాయల పరిమితిని 2 లక్షలకు పెంచారని, ఇటీవల పంట రుణములపై నాబార్డ్ వారు 8 శాతం వడ్డీ ప్రతిపాదించగా అధికారులతో సంప్రదించి ఇదివరకు ఉన్న 7 శాతంనే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు నిరర్థక ఆస్తులు (ఎన్పిఏ) 220 కోట్ల నుండి 120 కోట్లకు తగ్గిందని, ఎన్పిఏ 14 శాతం నుండి 10 శాతానికి తగ్గించారని చెప్పారు. అర్హత గల సహకార సంఘాల ద్వారా వారి సభ్యులకు కర్షకమిత్ర రుణసదుపాయం కల్పిస్తామని, ఇదివరకు ఉన్న ఓటీఎస్ ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు వరకు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార సంఘాల అధ్యక్షులు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు ఉపాధ్యక్షులు నల్ల చంద్ర శేఖర్ రెడ్డి, మార్క్ ఫెడ్ అధ్యక్షులు మార గంగారెడ్డి, ఐడిసిఎంఎస్ అధ్యక్షులు తారాచంద్ నాయక్, బ్యాంకు పాలకవర్గ సభ్యులు, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార సంఘాల అధ్యక్షులు, బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగభూషణం వందే, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



లండన్ కిడ్స్‌లో

చిట్టి చేతులతో మువ్వన్నెల జెండా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యాలకల్ రోడ్డులో గల యూకే కాన్సెప్ట్ ఇంటర్నేషనల్ ప్రీ స్కూల్ చైన్‌కు సంబంధించిన "లండన్ కిడ్స్" స్కూల్‌లో విద్యార్థులు జాతీయ జెండాలు వేశారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా శుక్రవారం చిన్నారులతో స్పెషల్ యాక్టివిటీ చేయించారు. వారి చేతులకు రంగులు వేసి, ఆ చేతులను పేపర్లపై అద్ది జాతీయ జెండాను చిత్రపటాన్ని వేయించారు. ఇది చూసిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారని లండన్ కిడ్స్ స్కూల్ కరస్పాండెంట్ మౌనిక తెలిపారు.

బడి బయటి పిల్లల సర్వే

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బడి బయటి పిల్లల సర్వేను శుక్రవారం మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో చాలా రోజుల నుండి బడికి గైర్హాజరు అవుతున్న విద్యార్థుల ఇంటికి వెళ్లి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి బడికి వచ్చేట్టు చూశామని క్లస్టర్ రిసోర్స్ పర్సన్ అంజయ్య తెలిపారు. తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులను క్రమం తప్పకుండా బడికి పంపాలని సూచించినట్లు తెలిపారు.

తాహెర్‌బిన్ హందాన్‌కు సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా తాహెర్ బిన్ హందాన్ నియామకమైన తర్వాత మొదటిసారి మండల కేంద్రానికి విచ్చేసిన సందర్భంగా తాహెర్ బిన్ హందాన్‌ను కమ్మర్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకట రవి ఆధ్వర్యంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ కు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, నూకల బుచ్చి మల్లయ్య, నాయకులు ఊట్నూరి ప్రదీప్, సుంకేట శ్రీనివాస్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

జిల్లా రవాణా శాఖ అధికారి ఉమా మహేశ్వరరావు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి ఉమా మహేశ్వరరావు అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆర్టీఏ కార్యాలయం నుంచి వర్ని చౌరస్తా వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. అనంతరం ట్రాఫిక్ రూల్స్ పై ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఎంవీఐలు కిరణ్ కుమార్, రాహుల్ కుమార్, ఐదో పోలీస్ స్టేషన్ ఎస్సై గంగాధర్, లక్ష్మయ్య, ఇబ్బంది పాల్గొన్నారు.

ఆర్టిజన్ ఉద్యోగులను కన్వర్షన్ చేయాలి

- రిలే దీక్షలకు మద్దతు తెలిపిన ఐద్వా

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఆర్టిజన్ ఉద్యోగులను కన్వర్షన్ చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అనిత సుజాత అన్నారు. ఐదవ రోజు టీవీఏసి జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నిజామాబాద్ విద్యుత్ సర్కిల్ ఆఫీస్ ముందు రిలే నిరాహార దీక్షలను శుక్రవారం ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత, అధ్యక్షురాలు అనిత దండలు వేసి ప్రారంభించారు. దీక్షను ఉద్దేశించి జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న ఆర్టిజన్స్‌ను వెంటనే కన్వర్షన్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం ఆర్టిజన్స్ ని రెగ్యులర్ చేస్తామని చెప్పి రెగ్యులర్ చేయక మోసం చేసిందన్నారు. ఆర్టిజన్స్ ని విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు ఉపముఖ్యమంత్రి కి ఆర్టిజెన్స్‌ను కన్వర్షన్ చేయాలని వినతి పత్రాలు అందజేశారు. ఆర్టిజన్స్ విద్యుత్ సంస్థలలో 15, 20 సంవత్సరాలు నుండి పనిచేస్తున్నారని వీరిని కన్వర్షన్ చేసి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు మాధవి, జేఏసీ కన్వీనర్ బట్టు గంగాధర్, రవి, కిరణ్, మురళి, థామస్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ మద్దతు..

ఆర్టిజన్ ఉద్యోగుల దీక్షకు కేవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండగంగాధర్, జిల్లా ఉపాధ్యక్షులు నలవాల నరసయ్య సందర్శించి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి పోరాటాలు మార్గమని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనిచ వారికి పదోన్నతులు కల్పించాలని అన్నారు.

కొత్తగా పట్టాపాస్ పుస్తకాలు వచ్చిన వారే రైతుభరోసా దరఖాస్తు చేసుకోవాలి

మండల వ్యవసాయాధికారి తలారి నర్సయ్య

నవతెలంగాణ-నిజామాబాద్ (సిరికొండ)



ఈ నెల 26 నుంచి రైతు భరోసా పథకాన్ని ప్రారంభించ నుందని మండల వ్యవసాయాధికారి తలారి నర్సయ్య శుక్రవారం తెలిపారు. ఈ పథకం కింద, ప్రతి అర్హుడైన రైతుకు సంవత్సరానికి ఒక్క ఎకరానికి రూ. 12వేల పెట్టుబడి సాయం అందించనుందని చెప్పారు. 2025 జనవరి ఒకటి వరకు కొత్త పట్టా పాస్ బుక్ వచ్చిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఇది వరకే వస్తున్న రైతులు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. సిరికొండ మండలంలో కొత్త పాస్ బుక్స్ పొందిన 678 మంది రైతుల డేటా వచ్చిందని, ఇప్పటికే రైతు బంధు పొందుతున్న రైతులు దరఖాస్తు పెట్టుకో వాల్సిన అవసరం లేదని అన్నారు. అర్హులైన వారు, వారి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారికి అప్లికేషన్ ఇవ్వాలని తెలిపారు. అప్లికేషన్ తో పాటు పట్టాపాస్ బుక్ ప్రతుల, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు జిరాక్స్, రైతు వేదిక కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాని తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ అనిల్

నవతెలంగాణ-మోర్తాడ్

రాష్ట్రంలో నిరుపేదలందరికీ ప్రభుత్వం పథకాలు అందిస్తుందని తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ అనిల్ అన్నారు. మోర్తాడ్ ప్రజా పాలన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి పేదవారికి ప్రభుత్వ పథకాలు అందించాలనే లక్ష్యం కాంగ్రెస్ పార్టీదని, ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా నిరుపేదలను గుర్తించి పథకాలను అందిస్తుందని అన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ భరోసా, రైతు భరోసా లాంటి పథకాలను అందిస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. 10 సంవత్సరాలలో ఒక రేషన్ కార్డు కూడా ఇవ్వని బీఆర్ఎస్ పార్టీ నేతలు కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, అది మానుకోవాలని అన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి అర్హతలను బట్టి వారికి ప్రభుత్వ పథకాలు అందిస్తామని తెలిపారు. పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్లు ఎన్ని ఇచ్చిందో ప్రజలకు తెలుసని, వైయస్సార్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లు కనిపిస్తున్నాయని తెలిపారు. ప్రజలను రెచ్చగొట్టి ప్రభుత్వ పథకాలు అందకుండా బీఆర్ఎస్ చేస్తుందని తెలంగాణ కోఆపరేటివ్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. పది సంవత్సరాలలో పేద ప్రజలను ఆదుకోలేదని, సంక్షేమ పథకాలు అందిస్తుంటే అడ్డుకోవడం, నిరసనలు తెలపడం సరికాదని అన్నారు. అనంతరం అధికారులు మంజూరైన లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించారు. ఇంకా ఎవరైనా లబ్ధిదారులు ఉంటే మరో విడత దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమ్మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నరసయ్య వైస్ చైర్మన్ సుంకేట్ బుచ్చన్న, వివిధ మార్కెట్ కమిటీ చైర్మన్ ల డైరెక్టర్లు, మండల అధికారులు శ్రీనివాసులు, తిరుమల, సత్యనారాయణ, నాయకులు రొక్క మురళి, మైపాల్, అశోక్, గోపి కాంగ్రెస్ నాయకులు పంచాయతీ సెక్రెటరీ సైపుద్దీన్ తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతన్న అనిల్

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి


ఘటనా స్థలంలో నాగౌండ మృతదేహం

నవతెలంగాణ-జుక్కల్

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందాడు. జుక్కల్ ఎస్సై భువనేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఘటన మండలంలోని పడంపల్లి గ్రామానికి చెందిన నాగౌండ (36) వ్యవసాయం చేస్తూ జీవనం గడిపేవాడు. గురువారం సాయంత్రం భార్య చికెన్ తీసుకురావాలని భర్తను కోరడంతో భార్య కోరిక మేరకు వాహనంపై పెద్దఎడ్గికి వెళ్తున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. దారి నుంచి వెళ్తున్న కొంతమంది వ్యక్తులు పడంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి కావడంతో గుర్తించి గ్రామానికి చెందిన వారికి ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భార్య గంగామని ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వరి పంట పరిశీలన


పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి

నవతెలంగాణ-డొంకేశ్వర్

మండలంలోని నికాల్‌పూర్ గ్రామ శివారులో వరి పంటను మండల వ్యవసాయాధికారి మధుసూధన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంటకు మొగిపురుగు సోకినట్టు గుర్తించారు. దాని నివారణకు పిచికారీ చేయాల్సిన మందులను రైతులకు సూచించారు. అలాగే పంట రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు.

అర్హులకే ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు
- పలు గ్రామాల్లో సభలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

జుక్కల్ : అర్హులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయనున్నట్టు ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రజాపాలన గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకే అందాలనే ఉద్దేశ్యంతో అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి అర్హులైన వారి జాబితా రూపొందించారని తెలిపారు. జాబితాలో పేరు లేని వారు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. నిజమైన లబ్ధిదారులుంటే గ్రామ సభలో కానీ మండలంలోని ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి భాస్కరన్, జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్, అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హత కలిగిన పేద కుటుంబాలకు లబ్ధి చేకూరేలా పథకాలు

గాంధారి : అర్హత కలిగిన పేద కుటుంబాలకు లబ్ధి చేకూరే విధంగా పథకాలు మంజూరు చేయనున్నట్టు అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కరక్‌వాడీ గ్రామంలో ప్రజాపాలన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో గ్రామ సభ ఆమోదం మేరకు అర్హత కలిగిన వారికి లబ్ధి చేకూర్చనున్నట్టు వివరించారు. ఇదివరకు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారు ప్రస్తుతం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ గ్రామసభలో తహసీల్దార్ సతీష్ రెడ్డి, మాజీ సర్పంచ్ చందర్ రావు, కాంగ్రెస్ నాయకులు ఉమ్మాజీ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందేలా కృషిచేస్తా

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలోని శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజా పాలన గ్రామ సభను అధికారులు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి లబ్ధిదారులు ఎంపికైన జాబితాను చదివి వినిపించడంతో జాబితాలో తమ పేర్లు ఎందుకు రాలేదని ప్రశ్నించడంతో గ్రామసభ ఒక్కసారిగా గందరగోళానికి దారి తీసింది. గ్రామ సభలో వచ్చిన ప్రతి ఒక్క అధికారులను ప్రశ్నించడం ప్రజల వంతు అయ్యింది. దీంతో గ్రామ సభలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి వద్దకు మహిళలు వెళ్లి తమకు ప్రభుత్వం పథకాలు అందేలా చూడాలని వేడుకున్నారు.

పథకాల అమలు.. నిరంతర ప్రక్రియ

సదాశివనగర్ : ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన కుటుంబాల జీవితాల్లో సంతోషం నింపే విధంగా ఉన్నాయని.. ఇది నిరంతర ప్రక్రియ అని ఎస్సీ విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్, బిజెపి నాయకులు పథకాల పట్ల ప్రజలకు కళ్లిబొల్లి మాటలు చెబుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు అందవని ప్రజలను నిరాశ చెందే విధంగా చెబుతున్న వాళ్ల మాటలు నమ్మవద్దని తప్పకుండా అర్హులైన పేదలకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు.


జుక్కల్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అర్హులందరికీ సంక్షేమ పథకాలు..

పిట్లం : ప్రజా పాలనలో భాగంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం కోసం ప్రభుత్వం గ్రామ సభను నిర్వహిస్తుందని మండల ప్రత్యేకాధికారి వామన్ రావు అన్నారు. శుక్రవారం మండలంలోని జగదాంబతండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అందించనున్నట్టు తెలిపారు. సంక్షేమ పథకాలలో ఎంపిక కానటువంటి లబ్ధిదారులు నేరుగా గ్రామసభలో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కమలాకర్, ఆయా శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తాండవాసులు పాల్గొన్నారు.

రెంజల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకుని నాలుగు పథకాలకు సంబంధించిన దరఖాస్తులను చేసుకోవాలని ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ సూచించారు. మండలంలోని పేపర్‌మిల్లు, మౌలాలితాండ గ్రామాలలో ప్రజాపాలన గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇల్లు లేని నిరుపేదలందరూ ఇంతవరకు దరఖాస్తులు చేసుకోనట్లయితే తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద గుంట భూమి లేని నిరుపేదలు ఉపాధి హామీ పథకం కింద 20 రోజులు పనిచేసిన వారికి ఏడాదికి రూ.12000ల చొప్పున ఈ పథకం కింద ఆర్థిక సాయం అందజేయనున్నట్టు వివరించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్ఐ రవికుమార్, ఈవో గోపికృష్ణ, పేపర్‌మిల్లు గ్రామంలో శ్రీనివాసరావు, ఐకెపి ఏపిఎం చిన్నయ్య, కార్యదర్శి భాస్కర్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశలు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ పథకాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ స్పష్టం చేశారు. మండలంలోని రెంజల్, తాడ్‌బిలోలి, సాటాపూర్, వీరన్నగుట్ట, వీరన్నగుట్ట తండాలో ప్రజా పాలన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడతల వారీగా ప్రతి నిరుపేదకు జనవరి 26 నుంచి 4 పథకాలైన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, రేషన్ కార్డు లేని వారందరికీ రేషన్ కార్డులను మంజూరు చేస్తుందని తెలిపారు. రైతు భరోసా పథకాన్ని వర్తింపచేయడానికి కసరత్తు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని నిరుపేదలందరూ దరఖాస్తులు చేసుకొని లబ్ధిపొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్ఐ రవికుమార్, గ్రామ కార్యదర్శి శ్రీకాంత్, క్షేత్ర సహాయకులు మధు, రెంజల్ మండల కేంద్రంలో తహసీల్దార్ శ్రవణ్ కుమార్, ఈసీ శరత్ చంద్ర, గ్రామ కార్యదర్శి రాజేందర్, క్షేత్ర సహాయకుడు శోభన్, వీరన్నగుట్ట గ్రామ సభలో ఏవో శ్రీనివాసరావు, ఏపిఎం చిన్నయ్య, గ్రామ కార్యదర్శి రాజు, క్షేత్ర సహాయకుడు శంకర్, సాటాపూర్ గ్రామంలో ఎంపీవో రఫీ హైమద్, గౌతమ్, అజయ్, మోబిన్‌ఖాన్, జావీద్, లచ్చేవార్ నితీన్, గ్రామ కార్యదర్శి మహబూబాబాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.


పిట్లంలో..

లింగంపేట్ : మండలంలోని ఆయా గ్రామాలలో నాలుగో రోజు గ్రామ సభలు నిర్వహించారు. మండలంలోని భయంపల్లి, లింగంపల్లి, నల్లమడుగు, ముస్తాపూర్, ఎల్లారం, కొయ్యగుండు తండా, ఎల్లమ్మగడ్డ తండాలో గ్రామ సభలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ఏర్పాటు చేసి గ్రామ సభల్లో పథకాలకు చెందిన లబ్ధిదారుల పేర్లు వెల్లడించారు. అనంతరం పలువురు చేత దరఖాస్తులను స్వీకరించారు. ఈ గ్రామసభలో ఎమ్మార్వో నరేందర్, ఎంపీఓ మలహరి, ఏపిఎం శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్‌తో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూర్(రాజంపేట్) : భిక్కనూర్, రాజంపేట్ మండలాలలో ప్రజాపాలన గ్రామసభలు ప్రశాంతంగా అధికారులు నిర్వహించారు. భిక్కనూర్ మండలంలో కాచాపూర్, పెద్దమల్లారెడ్డి, ర్యాగట్లపల్లి, తిప్పాపూర్ గ్రామాలలో, అలాగే రాజంపేట్ మండలంలోని ఎల్లారెడ్డిపల్లి, ఇతర గ్రామాలలో ప్రజాపాలన గ్రామసభలు ప్రశాంతంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఎమ్మార్వోలు శివప్రసాద్, అనిల్‌కుమార్, ఎంపీడీవోలు రాజ్ కిరణ్‌రెడ్డి, రఘురాం, మండల ప్రత్యేకాధికారులు రజిత, ఆయా గ్రామాల కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టి గ్రామస్తుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీనిచ్చారు.

ముగిసిన గ్రామసభలు

తాడ్వాయి : ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలు అందించడానికి నిర్వహించిన గ్రామసభలు నేటితో ముగిశాయి. మండలంలోని చందాపూర్, సంగోజువాడి గ్రామాల్లో ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులకు ఎంపికైన లబ్ధిదారుల పేర్లు సభలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి రాజారాం, మండలాభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్ అలీ, వ్యవసాయాధికారి నర్సింలు, మండల పంచాయతీ అధికారి సవితారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు గైని శివాజీ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : మండలంలోని ఆవల్‌గావ్ గ్రామపంచాయతీలో శుక్రవారం పథకాల అమలు కోసం గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే రైతు భరోసా, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోసం అధికారులు చేపట్టిన సర్వే వివరాలను గ్రామ కార్యదర్శి సతీష్ చదివి ప్రజలకు వినిపించారు. అధికారులు నిర్వహించిన సర్వే నివేదికలు గ్రామపంచాయతీకి అతికించారు. ఈ కార్యక్రమంలో జీపి ప్రత్యేకాధికారి వెంకట నరసయ్య, డిప్యూటీ తహసీల్దార్ భరత్, ఏఈఓ సౌమ్య ఐకెపి సిసి సుమిత్ర, ఆశావర్కర్ మీరాబాయి, అంగన్వాడీ కార్యకర్తలు పూజ, మాదాబాయి, ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి : కామారెడ్డి పట్టణంలోని 36, 37, 39వ వార్డులో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు కార్యక్రమంలోని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ ప్రజలకు అండగా ఉంటుందని, రేషన్ కార్డులో పేర్లు లేని వారు దిగులు చెందవద్దు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, వార్డు కౌన్సిలర్లు పంబరి లతా శ్రీనివాస్, పాత శివ కృష్ణమూర్తి, మోటూరి శ్రీకాంత్, చాట్ల వంశీకృష్ణ, వనిత రామ్మోహన్, ఆర్వో గోపాల్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామసభలు

సదాశివనగర్ : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. పథకాలకు ఎంపికైన లబ్ధిదారుల పేర్లను గ్రామసభలో ప్రజలకు చదివి వినిపించారు. ఏమైనా అభ్యంతరాలుంటే తమకు చెప్పాలని అన్నారు. మండలంలోని కుప్రియాల్, మోడేగాం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఈవో చందర్ నాయక్, తహసీల్దార్ గంగాసాగర్, ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంపీ ఓ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : మండలంలోని గోపాల్పేట్, గోలిలింగాల్, జలాల్పూర్, ఆత్మకూర్ గ్రామాలతో పాటు పలు గ్రామాలలో గ్రామసభలు ముగిశాయి. గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామసభలు శుక్రవారం నాటికి ముగిశాయి. గ్రామాలలో నిర్వహించిన గ్రామసభలలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. గోపాల్పేట్ గ్రామంలో అనర్హులకు జాబితాలో చేర్చారని పలువురు ఆరోపించారు. అర్హులకు మాత్రమే పథకాలు అందుతాయని ఎంపీడీవో ప్రభాకర్‌చారి పేర్కొన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఏడిఏ రత్నం, పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.


రాజంపేట్ : ఎల్లారెడ్డిపల్లిలో మాట్లాడుతున్న సెక్రెటరీ

సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ


రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని ఊట్పల్లి గ్రామంలో సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల పోస్టర్లను నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. శాఖ కార్యదర్శి దండు సాయిలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గంగాధర్ మాట్లాడుతూ.. జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సభలను జయప్రదం చేయాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజలు, రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, ఉద్యోగులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ సభలను విజయవంతం చేయాలన్నారు. 25వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని, అలాగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పేర్కొన్నారు. ప్రధానంగా గత మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీని రద్దుచేసి కొత్త కమిటీని కార్యదర్శిని ఎన్నుకోనున్నట్టు వివరించారు. రాబోయే కాలంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ఉన్న సమస్యలపైన కార్యచరణ రూపొందించి వారి సమస్యలపై ఎక్కడికక్కడ విడివిడిగా పోరాటాలు చేయనున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైన వారి నుంచి ప్రజలకు అందవలసిన పథకాలపైన, హక్కులపై పోరాటాలు నిర్వహించి ప్రజల పక్షాన నిలబడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుంకరి లక్ష్మి, దండు స్వరూప, దండు సోని, హన్మవ్వ, పోషవ్వ, ఆరిఫా, అన్వర్, పద్మ, రామ, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ, సంగెం రేవుల బ్రిడ్జిల నిర్మాణం రద్దు పుకార్లు మాత్రమే

- ఎవరూ నమ్మవద్దు
- గాంధారి మాజీ సర్పంచ్ మామ్మాయి సంజీవ్ యాదవ్



నవతెలంగాణ-గాంధారి

పోచమ్మ, సంగెం రేవుల బ్రిడ్జిల నిర్మాణం రద్దు పుకార్లు మాత్రమేనని ఎవరూ నమ్మవద్దని గాంధారి మాజీ సర్పంచ్ మామ్మాయి సంజీవ్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గాంధారి గ్రామంలో మంజూరు చేసిన పోచమ్మ రేవు బ్రిడ్జి రద్దు అయిందని పుకార్లు లేపుతున్నారని పేర్కొన్నారు. కొంతమంది ఏకంగా మాజీ సర్పంచ్ రద్దు చేయించాడంటూ పుకార్లు వస్తున్నాయని తెలిపారు. శనివారం గాంధారి గ్రామంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ పర్యటన ఉందని, అందులో భాగంగా గాంధారిలోని పోచమ్మ రేవు, సంగెం రేవు బ్రిడ్జిలను ప్రతిపాదించిన స్థలాలను పరిశీలించనున్నట్టు పేర్కొన్నారు.

రేషన్ కార్డుల సర్వే పరిశీలన

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలో రేషన్ కార్డులకు ఎంపికైన లబ్ధిదారుల కుటుంబ వివరాలు క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే చేపట్టగా.. శుక్రవారం డిసిఎస్ఓఎం మల్లికార్జున బాబు పరిశీలించినట్లు తహసిల్దార్ రహీముద్దీన్ తెలిపారు. ఎంపికైన వారికి ఈ నెల 26న జరిగే సమావేశంలో కార్డులు అందజేయున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ప్రతిరోజు వ్యాయామం తప్పనిసరి


ఫిజియోథెరఫీ చికిత్స నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నిజాంసాగర్

వికలాంగ విద్యార్థులకు క్రమం తప్పకుండా వ్యాయామం నిర్వహించాలని ఫిజియోథెరపీ డాక్టర్ అరుణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యాభ్యసిస్తున్న వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికలాంగ విద్యార్థులకు వారి తల్లిదండ్రులు ఇంటి వద్దనే చిన్నచిన్న వ్యాయామ ఆసనాలను చేయించినట్లయితే వారి అవయవలోపం క్రమేపీ తగ్గుదల ఉంటుందని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రాజ్, కాంప్లెక్స్ సీఆర్పి శంకర్‌గౌడ్, ఐఈఆర్‌టి గైని చిన్న సాయిలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

చలో ట్యాంక్ బండ్‌కు తరలిరావాలి


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-తాడ్వాయి

ఫిబ్రవరి 7న ట్యాంక్‌బండుపై జరిగే లక్ష డప్పులు, వేయి గొంతుకల జరగనున్న సభకు మాదిగలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చిట్యాల సాయన్న మాదిగ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏబిసిడి వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 7న ట్యాంక్ బండ్‌లో జరిగే లక్ష డప్పులు వేల గొంతుకల సభకు మాదిగలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ బాగయ్య, అంజయ్య, సంపత్, మల్లికార్జున్, అంజయ్య, శ్రీనివాస్, అలివేలమ్మ, గద్దల కుమార్, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందజేయాలని వినతి

నవతెలంగాణ-భిక్కనూర్

అర్హులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందాలని మండలంలోని కాచాపూర్ గ్రామ ప్రజలు తహసిల్దార్ శివప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో మరోసారి ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల సర్వే చేయాలని, గత సర్వేలో అనుమానాలున్నాయని తెలిపారు. మరోసారి సర్వే చేసి అర్హులను గుర్తించి పేద ప్రజలకు, అర్హులైన వారికి న్యాయం చేయాలని వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు.

మద్యం విక్రయిస్తే జరిమానా

- గ్రామస్తుల తీర్మానం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పోతాయిపల్లి గ్రామంలో మద్యం విక్రయిస్తే జరిమానా విధిస్తామని గ్రామస్తులు శుక్రవారం తీర్మానం చేశారు. ఆయా కుల సంఘాల సభ్యులు సమావేశం ఏర్పాటు చేసుకొని అందరి అభిప్రాయాల మేరకు మద్యం విక్రయించవద్దని తీర్మానం చేశారు.

గురుకులాల్లో దరఖాస్తు చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రతి విద్యార్థి విద్యావంతులై విజేతలుగా నిలవాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రఘు తెలిపారు. మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ, గురుకులాలు, కేజీబీవి, ప్రైవేట్, మోడల్‌స్కూల్స్ 5వ తరగతి బాలబాలికలకు కామన్ ఎంట్రన్స్ టెస్ట్- 2025పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీ, జనరల్ గురుకులాల విద్యకై 5వ తరగతి ప్రవేశాలు, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతి వరకు, టీజీఎస్‌డబ్లు ఈఐఎస్ గౌలిదొడ్డి, అలుగునూరు సీఓఈలలో 9వ తరగతి ప్రవేశాలు, టిజిటిడబ్ల్యూఆర్ ఈఐఎస్ ఖమ్మం, పరిగి ఎస్ఓఈలలో 8వ తరగతి ప్రవేశాలు, టీజీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్ రుక్మాపూర్ సైనిక్‌స్కూల్, మల్కాజ్‌గిరి ఫైన్ ఆర్ట్స్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు దారులు https://tgcet.cgg.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే సమర్పించాలని పేర్కొన్నారు. పరీక్ష తేదీ 23.02.2025, 01.02.2025 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ వెంకటేశం, రామ్‌శంకర్, సిబ్బంది శంకర్, సిద్ధిరామేశ్వరనగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కల్పన, ఉపాధ్యాయురాలు స్వప్న తదితరులు పాల్గొన్నారు.